RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 15 ఆగస్ట్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:67

## ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి

**ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి మీడియాతో మాట్లాడుతూ మంత్రిమండలి సమావేశ వివరాలను వెల్లడించారు.**




మిగతా 2 లో

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శుభ సందర్భంగా తెలంగాణలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం నిర్ణయించింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా రేషన్ కార్డులు జారీ చేసి 62 లక్షల మందికి లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో ఈరోజుకు మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు ఉండగా, వారందరి స్మార్ట్ రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం: ప్రధాని మోదీ




80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు.

ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి:గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**- తెలంగాణ ప్రజలకు గవర్నర్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్, ఆగస్టు 14,2026: ఈ నెల 15 వ తేదీన దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా దేశ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ధైర్యసాహసాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని గవర్నర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.

ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి కృషి భారత్‌ను మరింత బలమైన, స్వావలంబనతో కూడిన ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని శ్రీ శివప్రతాప్ శుక్లా కోరారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందేలా శాంతి, సౌభ్రాతృత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి

ఐక్యత, సమగ్రత, అభివృద్ధి స్ఫూర్తితో ఉజ్వల భారతావని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ ఆకాంక్షించారు. దేశ ప్రగతిలో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

త్రివర్ణ పతాకం ఎల్లప్పుడూ గర్వంగా రెపరెపలాడాలని, దాని మూడు రంగులు దేశ ప్రజల్లో ధైర్యం, శాంతి, విశ్వాసానికి ప్రతీకలుగా నిలవాలని గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వికసిత్ భారత్ నిర్మాణానికి పునరంకితం కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు శుభవార్త.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**విద్యార్థులకు శుభవార్త. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఇకనుంచి ప్రతి ఏటా అడ్వాన్స్‌గా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి డబ్బులను ముందుగానే వారి ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు.

నెక్లెస్ రోడ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించి ఆ మహనీయులకు నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ వాకిటి శ్రీహరి , అజరుద్దీన్ , సలహాదారులు కే కేశవ రావు , వీ హనుమంత రావు , ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఈ సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఫీజులు కట్టలేదని, యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఆపడానికి వీలులేదు. విద్యార్థులు అడక్కుండానే వారి ఖాతాలో డబ్బులు వేస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఈ విద్యా సంవత్సరం నుంచి ముందస్తుగా బ్యాంకు ఖాతాల్లో సిద్ధంగా పెడుతున్నాం. ఈ విధానాన్ని ప్రక్షాళన చేసి, ప్రతి ఏటా రూ. 2,400 కోట్లు విద్యార్థుల ఖాతాల్లో వేసి ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని తెలిపారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. "ఒకప్పుడు ఇంజనీరింగ్, డాక్టర్ డిగ్రీ సర్టిఫికెట్ ఉంటే ఉద్యోగాలు వచ్చేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. స్కిల్స్ ఉంటే ఉద్యోగాలు వస్తాయి. అందుకే నర్సరీ నుండి 12వ తరగతి వరకు విద్య, ఆ తర్వాత స్కిల్స్ నేర్పాలి. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికి ఈ సమాజం రెడ్ కార్పెట్ పరుస్తుంది. కేవలం సర్టిఫికెట్ ఉంటే ఉద్యోగం వస్తుందో రాదో.. చెప్పలేం" అని పేర్కొన్నారు.

మిగతా 2 లో

## సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే...

వార్తా 2 లో

## ముఖ్యమంత్రి సభకు సర్వం సిద్ధం....

**సంగారెడ్డిలో ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి**



**సంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**సంగారెడ్డిలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు,ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభను లక్ష మంది తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు,సభ విజయవంతం కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్,మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ,వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని చెప్పారు,సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ,రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు,సీఎం సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచే సుమారు 50 వేల మంది హాజరవుతారని జగ్గారెడ్డి పేర్కొన్నారు,గత ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చిందని విమర్శించిన ఆయన,కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి అందించనుందని తెలిపారు. సభకు వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని జగ్గారెడ్డి వెల్లడించారు,ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాబలం

15 ఆగస్ట్ 2026 శనివారం

# తెలుగు రాష్ట్రాల్లో కనిపించని జెన్ జీ

ఆధునిక రాజకీయాల్లో జెన్ జీ ఓటర్లు అత్యంత కీలకమైన శక్తిగా మారుతున్నారు. జెన్ జీ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాలను గడగడలాడించిన దృశ్యాలను చూసి, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు కూడా ఈ తరాన్ని తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, గడిచిన కొద్దికాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జెన్ జీ కార్డు క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జెన్ జీ ఆధారిత ప్రచారాన్ని తీవ్రంగా నడిపే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ చదువుల్ని క్రిమినల్ వేస్ట్ అని సంబోధించడంతో యువ ఇంజనీర్లందర్నీ అలా అన్నారని కేటీఆర్ క్యాంపెయిన్ చేశారు. క్రిమినల్ వేస్ట్ , అన్ ఫిట్ వంటి హ్యాష్ట్యాగ్‌లు, మీమ్ కల్చర్‌తో యంగ్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూశారు. అయితే, ఈ మీమ్స్ సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌గా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, నిరుద్యోగ యువతను లేదా కాలేజీ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాస్ ప్రొటెస్ట్‌గా మార్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది.ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని పునర్నిర్మించే క్రమంలో యువతను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రయత్నించింది. అయితే, నిజమైన తటస్థ జెన్ జీ యువతను భాగస్వాములను చేయడం కంటే, ఇప్పటికే పార్టీలో ఉన్న తమ అనుబంధ విద్యార్థి విభాగం, ఐటీ సెల్ కార్యకర్తలకే జెన్ జీ అనే కొత్త ల్యాబెల్ వేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం కనిపించింది. డీఎస్సీ పోరాటాల్లో ఈ పద్ధతి ఎక్కువగాఉంది. కేవలం పార్టీ ప్రచార పత్రాలు పట్టుకుని ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్‌లలో హల్‌చల్ చేయడం వల్ల అది కేవలం ఆర్గనైజ్డ్ పార్టీ ప్రచారంగానే మిగిలిపోయింది తప్ప, ఏపీలోని సాధారణ యువతలో ఎలాంటి పొలిటికల్ అప్‌రైజింగ్‌ను తీసుకరాలేకపోయింది.తెలుగు యువతలో అత్యధిక శాతం మంది ఐటీ ఉద్యోగాలు, యూఎస్/యూకే ఉన్నత చదువులు, గ్రూప్స్. సివిల్స్ , ఇతర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలోనే నిమగ్నమై ఉన్నారు. డిజిటల్ స్పేస్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినా, రోడ్లెక్కి నిరసన తెలిపితే నమోదయ్యే క్రిమినల్ కేసులు తమ భవిష్యత్తు, వీసా అవకాశాలను దెబ్బతీస్తాయనే హెచ్చరిక వారిని వెనక్కి లాగుతోంది. నేటి తరం రాజకీయ వ్యతిరేకతను లేదా మద్దతును రీల్స్, మీమ్స్, ఎక్స్ , స్పేసెస్, డోపమైన్ ఇచ్చే డిజిటల్ కంటెంట్ రూపంలోనే చూపిస్తోంది. వీధి పోరాటాల కంటే డిజిటల్ ట్రోలింగ్‌నే వారు సౌకర్యవంతమైన యాక్టివిజంగా భావిస్తున్నారు.రాజకీయ పార్టీలు జెన్ జీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నాయి. నాయకులు వేసే మీమ్స్ లేదా వాడే జార్గన్స్ చూసి తమను వారు ప్రతిబింబిస్తున్నారని యువత భావించడం లేదు. పార్టీలు ప్రదర్శించే ప్రచా కృత్రిమమైనది గా ఉండటంతో యువత సులభంగా గుర్తిస్తోంది. ఉపాధి అవకాశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్, గిగ్ ఎకానమీ కార్మికుల సమస్యలు, స్టార్టప్ ఈకోసిస్టమ్, ప్రాజెక్టుల పురోగతి వంటి నిజమైన ఎజెండా వదిలేసి.. కేవలం వ్యక్తిగత దూషణలు, రాజకీయ ట్రోలింగ్ చుట్టూ తిరిగే కంటెంట్‌ను జెన్ జీ లైట్ తీసుకుంటోంది.రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయనంత మాత్రాన తెలుగు జెన్ జీకి రాజకీయ స్పృహ లేదనుకోవడం పార్టీల పెద్ద పొరపాటే అవుతుంది. వారు నిశ్శబ్దంగా గమనించే సైలెంట్ ఓటర్లు . బూత్ లెవల్‌కి వచ్చి ఓటు వేసే సమయంలో సాంప్రదాయ కుల, ప్రాంతీయ సమీకరణల కంటే.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఉద్యోగ కల్పన, పారదర్శక పాలన అందించే నాయకులకే ప్రాధాన్యత ఇస్తారు. ఏదైనా ఒక రాజకీయ పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసం తమను పొలిటికల్ టూల్ గా వాడుకోవాలని చూస్తే తిరస్కరించడంలో ఈ తరం ముందే ఉంటుంది. నాయకులు కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే విజన్‌ను చూపినప్పుడే ఈ తరం ఓటర్లు నిజమైన మద్దతుదారులవుతారు.

# 15న లోక్ భవన్‌లో సాయంత్రం 06.00 గంటలకు 'ఎట్ హోమ్'

## ఆహ్వానితులు 5.30 గంటలకల్లా 'ఎట్ హోమ్' లో తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులు కావాలి: గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్, ఆగస్టు 14, 2026:స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన సాయంత్రం 6.00 గంటలకు లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ఆధ్వర్యంలో 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించనున్నారు.
ఇప్పటికే కార్యక్రమ ఆహ్వానితులకు ఆహ్వాన పత్రికలు పంపినట్లు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. దాన కిషోర్ తెలిపారు.
ఆహ్వానితులు సాయంత్రం 5.30 గంటలకల్లా లోక్ భవన్‌లోని 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించే లోక్ భవన్ లాన్స్ వద్దకు చేరుకోనీ తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులు కావాలనీ ఆయన సూచించారు. ఆహ్వాన పత్రికనే ఎంట్రీ పాస్ గా పనిచేస్తుందని,ఎట్ హోమ్ కు వచ్చే ముందు ఆహ్వానితులు తప్పనిసరిగా తమ వెంట ఆహ్వాన పత్రిక ను వెంట తీసుకురావాలని కోరారు.

# సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే...

## ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే
## నాణ్యతలో రాజీ పడొద్దు... ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి
## గోదావరి పుష్కరాలు -- 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు



గోదావరి పుష్కరాలు-2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు -- 2027' కేబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు.

శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి

మొదటి పేజీ తరువాయి

గత ఏడాది నిర్వహించినట్లే, ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని తీర్మానించింది. ఈ సదస్సును డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు శ్రీధర్ బాబు , ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి , వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశం భావించింది.

ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ఆవిష్కరిస్తారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహిస్తారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి మీడియాతో మాట్లాడుతూ మంత్రిమండలి సమావేశ వివరాలను వెల్లడించారు.

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని మంత్రిమండలి తీర్మానించింది. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. ఈసారి గతంలో ఎన్నడూలేని విధంగా 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసిన అంశంపై చర్చించింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించాలని తీర్మానించింది.

ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి, ఈ వేలం (e-Auction) ద్వారా ధాన్యం విక్రయించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేస్తారు.

కొత్తగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలి విడతగా 113 నియోజకవర్గాల్లో స్కూల్ కాంప్లెక్స్ లను నిర్మించగా, ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి.

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి, హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వాటిని ఈవీ లుగా మార్చేందుకు రూ. 200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1 లక్ష 50 వేలు సబ్సిడీ అందిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నారు.

హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన HILT పాలసీ దరఖాస్తు గడువును మంత్రిమండలి మరో 3 నెలలు పొడిగించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-II పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుంది.

గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

## పంచాలింగాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం
## కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ తీవ్ర విమర్శలు

వికారాబాద్ మర్పల్లి మండలం పంచాలింగాల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బేగరి మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి డా. మెతుకు ఆనంద్ పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ యువజన విభాగం కార్యాలయాన్ని ప్రారంభించారు.తదుపరి నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో డా. మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో సుమారు 80 మంది యువకులకు పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువత తలుచుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. వికారాబాద్ నియోజకవగంలోని ప్రతి గ్రామపంచేతిలలో ఎన్నికల సందడి అవతావరణం తల్పిస్తుందని అన్నారు ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా చేయలేకపోవడంతో గ్రామాలలోని యువత మొత్తం భారీగా బి ఆర్ ఎస్ పార్టీలో చేరడం తో పండగ వాతావరణంల తలపిస్తోందని అన్నారు. ఇలాగే యువత తలుచుకుంటే రానున్న ప్రభుత్వం బి ఆర్ ఎస్ పక్కా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందిరైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని డా. మెతుకు ఆనంద్ విమర్శించారు. యూరియా కోసం యాప్ ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. షాపుల వద్ద రైతులు పెద్ద ఎత్తున క్యూలైన్లలో నిలబడితే ప్రభుత్వ పరువు పోతుందనే ఉద్దేశంతోనే యాప్ పేరుతో డ్రామా చేస్తున్నారని విమర్శించారు.రైతు బీమా విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పాలసీ డబ్బులు చెల్లించకపోవడంతో రైతులకు బీమా అందడం లేదని ఆరోపించారు.

## హైదరాబాద్ పోలీస్ అధికారులకు రెండు సేవా పతకాలు

### సేవా పతక గ్రహీతలకు సీపీ సజ్జనర్ సత్కారం




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ ప్రకటించిన ప్రతిష్ఠాత్మక సేవా పతకాలకు ఎంపికైన అధికారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ఘనంగా సత్కరించారు.

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపికైన సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ జే.నర్సయ్య, విశిష్ట సేవా పతకం వరించిన సైబర్ క్రైమ్ ఏసీపీ ఆర్‌జీ శివమారుతిలను శుక్రవారం సీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ..



విధి నిర్వహణలో అంకితభావం, అత్యుత్తమ నిబద్ధత ప్రదర్శించినందుకే అధికారులకు ఈ అత్యున్నత పురస్కారాలు దక్కాయని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో అదనపు డీసీపీ నర్సయ్య, సైబర్ నేరాల నియంత్రణ, సాంకేతిక దర్యాప్తులో ఏసీపీ శివమారుతి కనబరిచిన ప్రతిభ ప్రశంసనీయమన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పతకాలు సాధించడం ద్వారా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ కీర్తిప్రతిష్ఠలను మరింత పెంచారని, వీరి సేవలు ఇతర పోలీసు అధికారులకు, సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో ప్రజాసేవలో కొనసాగుతూ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

అధికారుల విశేష సేవల నేపథ్యం

లి అదనపు డీసీపీ జే.నర్సయ్య:1991లో ఎస్సైగా చేరి 35 ఏళ్లుగా సుదీర్ఘ సేవలందిస్తున్నారు. పలు కీలక కేసుల దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. గతంలో ఈయన 'ఇండియన్ పోలీస్ మెడల్' (ఐపీఎం) సహా పలు పతకాలు అందుకున్నారు.

సైబర్ క్రైమ్ ఏసీపీ ఆర్‌జీ శివమారుతి:1995లో ఎస్సైగా చేరి 31 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. రూ.127 కోట్ల పాన్-ఇండియా సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను 'ఆపరేషన్ ఆక్టోపస్' ద్వారా ఛేదించి గుర్తింపు పొందారు. దర్యాప్తులో ప్రతిభకు గాను 2022లో 'కేంద్ర హోంమంత్రి పతకం' సాధించారు.

ఈ కార్యక్రమంలో అదనపు సీపీ యం.శ్రీనివాస్, ఐపిఎస్, జాయింట్ సీపీ (ఎస్‌బీ), నార్త్ రేంజ్ శాంతిభద్రతల జాయింట్ సీపీ .ఎస్.ఎం.విజయ్‌కుమార్, ఐపీఎస్, డీసీపీలు కిరణ్ ఖారే ఐపిఎస్ (చార్మినార్ జోన్), ఎస్. శ్రీనివాస ఐపీఎస్ (రాజేంద్రనగర్ జోన్), ఎమ్. చైతన్య కుమార్ ఐపిఎస్ (డీడీ), శ్రీమతి లావణ్య నాయక్ జాదవ్ (వుమెన్ సేఫ్టీ వింగ్), డి. రాజేష్ (శంషాబాద్ జోన్), జె. రాఘవేందర్ రెడ్డి (గోల్కొండ జోన్), ఎ. రమణా రెడ్డి (జూబ్లీహిల్స్) తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొని పతక గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## మోనో ప్లే హై స్కూల్లో విద్యార్థి ఎన్నికలు...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 14(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/పట్టణంలోని మోనోప్లే హై స్కూల్లో విద్యార్థులు నైపుణ్యం పెంచడానికి పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు,స్కూల్ కెప్టెన్ గా విజయ్ సాత్విక్, వైస్ కెప్టెన్ గా దానం లాస్య శ్రీ ఎన్నికయ్యారు, ఎన్నికల అనంతరం పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల ఎన్నికలు నిర్వహించడం ద్వారా రాజ్యాంగంపై అవగాహనతో పాటు ప్రజాస్వామ్య నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.అభివృద్ధి చెందే నైపుణ్యాలు ప్రజాస్వామ్య నైపుణ్యం: ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియను అర్థం చేసుకోవడం,నాయకత్వ నైపుణ్యం: బాధ్యత తీసుకోవడం, ఇతరులను నడిపించడం.

నిర్ణయ సామర్థ్యం అభ్యర్థులను పరిశీలించి సరైన వ్యక్తిని ఎన్నుకోవడం,హక్కులు--బాధ్యతల అవగాహన: రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌర బాధ్యతలను తెలుసుకోవడం.

సమానత్వ భావన,కులం, మతం, లింగం వంటి భేదాలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు ఉండాలని తెలుసుకోవడం,స్వేచ్ఛా భావ వ్యక్తీకరణతమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం.చర్చ మరియు సహకారం: ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తూ కలిసి పనిచేయడం.

నియమాల పట్ల గౌరవం: ఎన్నికల నియమాలను పాటించడం,ఫలితాలను గౌరవించడం. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల ఎన్నికలు విద్యార్థులకు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను ఆచరణలో నేర్పే ఒక మంచి మార్గం. అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత నిందితుల అరెస్ట్.



**సత్తుపల్లి ప్రతినిధి ఆగస్టు 14 ప్రజాబలం:**ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో శుక్రవారం పోలీసులు గంజాయిని పట్టుకుని నిందితులను అరెస్టు చేశారు. ఒడిస్సా నుంచి హైదరాబాదుకు కారులో గంజాయి రవాణా అవుతుంది అన్న నమ్మదగిన సమాచారం మేరకు ఏసీబీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ టీం, సత్తుపల్లి పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేసి నేరస్తులను పట్టుకున్నారు. కారులో తరలిస్తున్న ఆరు కేజీల 360 గ్రాముల గంజాయిని కారును నేరస్తుల వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నేరస్తులు కామేష్ మారి, కార రాజేంద్ర లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అనంతరం ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గంజాయి నిరోధక చట్టంలో భాగంగా ఎవరైనా వ్యక్తులు గంజాయి కొన్న అమ్మిన గంజాయి పీల్చిన వారిపై పిడి కేసులు నమోదు చేస్తామని, గంజాయి గురించి సమాచారం ఉంటే పోలీసు వారికి తెలియజేయాలని వారి పేర్లు గోపిగా ఉంచుతామని తెలియజేశారు. ఈ దర్యాప్తులో ఎస్సై ప్రదీప్, ఈగల్ టీం సిబ్బంది పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు శుభవార్త.



**మొదటి పేజీ తరువాయి**

"ప్రభుత్వం సాంకేతిక నైపుణ్యం కోసం సంపూర్ణమైన అవగాహనతో ముందుకు వెళు న్నది. ఏటీసీలు, పాలిటెక్నిక్, స్కిల్స్ యూనివర్సిటీ.. ఇతర సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకోండి. ఆడపిల్లలు నర్సింగ్ చదువుకుంటే రూ. 2 లక్షలతో జపాన్ , జపాన్, సౌత్ కొరియా లాంటి దేశాల్లో ఉద్యోగాలు ఎదురు చూస్తున్నాయి.

ఇప్పుడు చదువుల్లో పోటీ పెరిగింది. చాలా మందికి 90 శాతం పైగా మార్కులు వస్తున్నాయి. చదువు మాత్రమే కాదు. సాంకేతిక నైపుణ్యంలో రాణించే వారూ ఉంటారు. కొందరు క్రీడల్లో రాణించే వారుంటారు. మట్టిలో మాణిక్యాలు ఉంటాయి" అని పేర్కొన్నారు.

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కోటి రూపాయల నగదు బహుమతిని అందిస్తామని ముఖ్యమంత్రి బాక్సింగ్ చాంపియన్ కు నిఖత్ జరీన్, సిరాజ్, దీప్తీ దివాంజీలను ఉదహరించారు.

"మీరూ క్రీడల్లో రాణించండి. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించండి. దేశ స్థాయిలో గౌరవాన్ని తీసుకురాండి. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధించండి. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి.. నగదు నజరానాలు ఇచ్చే బాధ్యత నాది.

కేవలం చదువుకుంటేనే బతుకులు మారుతాయి. చదువుకుంటేనే మన తలరాతలు మారుతాయి. సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అవకాశాల కోసం పోటీ పడాలి.

ఒకప్పుడు కంప్యూటర్ సైన్స్ చదువుకుంటే అమెరికాలో ఉద్యోగం వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సాంకేతిక విప్లవం వచ్చింది. ఏఐ వల్ల ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్, ఐటీ నిపుణుల ఉద్యోగాలు కూడా పోయే ప్రమాదం తలెత్తింది. ఏ విధంగా ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలో మనం ఆలోచన చేయాల్సిన అవసరముంది.

కులాల మధ్య అంతరాలను తగ్గించడానికి అన్ని వర్గాలు ఒకే చోట కలిసిమెలిసి జీవించడమనే లక్ష్యంతో రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విధానం ద్వారా విప్లవాత్మకమైన మార్పులు చేస్తున్నాం" అని చెప్పారు.

జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే లాంటి మహనీయుల జీవిత విశేషాలను వివరిస్తూ విగ్రహాలు చేయడం ఏర్పాటు కేవలం జయంతి, వర్ధంతులను నిర్వహించడానికి కాదని, గొప్ప వ్యక్తులు చేసిన త్యాగాలు, వారి గొప్పతనాన్ని విగ్రహాల ద్వారా స్ఫూర్తి పొందడానికి వేదికలుగా నిలుస్తాయని అన్నారు.

మహనీయుల స్ఫూర్తితో విద్యలో రాణించడమే కాకుండా సామాజిక చైతన్యంతో, సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలన్న ఉద్దేశంతో ఇక్కడ విగ్రహావిష్కరణ చేశామని చెప్పారు.

## హైదరాబాద్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



హైదరాబాద్ ఆగస్ట్ 14: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా అభియాన్లో భాగంగా హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు. +ఎవీజ కార్యాలయం సమీపంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు , కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి , శ్రీ బండి సంజయ్ కుమార్ , ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ , బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి గారు, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ధర్మపురి అరవింద్ , గోడెం నగేష్ , మురళీధర్ రావు మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.జాతీయ జెండాలను చేతబూనిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ర్యాలీని ఉత్సాహభరితంగా నిర్వహించారు. "తిరంగా ప్రతి ఇంటా ఎగరాలి.. ప్రతి హృదయంలో దేశభక్తి వెల్లివిరియాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా డా. బూర నర్సయ్య గౌడ్ గారు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ -- ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### దేశభక్తి నినాదాలతో మార్మోగిన తాండూరు..

### తిరంగా యాత్ర లో భారీగా పాల్గొన్న విద్యార్థులు

తాండూరు దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ తాండూరు మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, జాతీయవాదులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో తాండూరు ప్రధాన రహదారులు జాతీయ జెండాలతో కళకళలాడాయి.స్థానిక యూనియన్ బ్యాంక్ అండర్ బ్రిడ్జి నుంచి ప్రారంభమైన తిరంగా యాత్ర ఐబీ ప్రధాన కూడలి అండర్ బ్రిడ్జి మీదుగా కొనసాగింది. పాల్గొన్న వారు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ నిర్వహించిన ఈ యాత్ర స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ప్రతి భారతీయుడు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని చాటాలని వారు పిలుపునిచ్చారు.తిరంగా యాత్రలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక విద్యాభారతి, సెయింట్ థెరిస్సా పాఠశాలలకు చెందిన 300 మందికి పైగా విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని యాత్రలో పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో యాత్ర మార్గం మార్మోగింది.దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నాయకులు అన్నారు. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, కోట్లాది భారతీయుల గౌరవం, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ, జిల్లా కార్యదర్శులు రామగౌని మహీధర్ గౌడ్, రాచర్ల సంతోష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, బొల్లెడ్ల కేశవరెడ్డి, యంగర్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాగిడి చిరంజీవి, నర్సింగ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్‌తో పాటు మండల నాయకులు, జాతీయవాదులు అభినవ సంతోష్ కుమార్, గాదె రాజేశం, చోక్కాల నాగభూషణ్, ఏముర్ల ప్రవీణ్, గుజ్జేటి శేఖర్, ప్రభాకర్, అడ్వాల సతీష్, ఎలిగేటి నరేష్, ఆనంద్, కామెర మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీకి ఏమైంది

విజయవాడ, ఆగస్టు 14 రాజకీయాల్లో శత్రువుకి శత్రువు మిత్రుడు కావడం ఎంత సహజమో, ఐడియాలజీ లేదా స్వప్రయోజనాల విషయంలో విభేదాలు వస్తే నిన్నటి మిత్రుడే నేడు తీవ్ర విమర్శకుడిగా మారడం కూడా అంతే సహజం. మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న చర్చ సరిగ్గా ఈ సమీకరణాల చుట్టూనే తిరుగుతోంది. వైఎస్సార్సీపీ హయాంలో కక్షసాధింపు చర్యలకు గురయ్యారనే సానుభూతితో, ఆయనకు అండగా నిలిచిన టీడీపీ శ్రేణులు.. నేడు ఆయన మారుతున్న వైఖరిని చూసి తీవ్రగ్భ్రాంతికి గురవుతున్నాయి ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌కు గురై, తీవ్ర కేసులను ఎదుర్కొన్న సమయంలో టీడీపీ శ్రేణులు, మీడియా ఆయనను ఒక బాధితుడిగా ' భావించి పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ యంత్రాంగం ఆయనపై చూపిన కఠిన వైఖరిని తప్పుబడుతూ ఆయనకు సుదీర్ఘ పోరాటంలో అండగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనపై ఉన్న సీఐడీ కేసులు, విచారణలను పక్కనబెట్టి, ఆయన వివాదాలకు ముగింపు పలికి క్లీన్ చిట్ లభించేలా చట్టబద్ధమైన ఊరట నిచ్చింది. అయితే, ఆ తర్వాత ఏబీ వెంకటేశ్వరరావు అనుసరిస్తున్న తీరు, ఆయన మాటల శైలి టీడీపీ క్యాడర్‌కు తీవ్ర మింగుడుపడటం లేదు. ఇటీవలి కాలంలో ఆయన ప్రభుత్వ ప్రాజెక్టులు, పాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర విమర్శలు గుప్పిస్తుండటం చర్చనీయాంశమైంది. రాయలసీమ ప్రాజెక్టులైన కడప స్టీల్ ప్లాంట్‌పై స్పందిస్తూ.. అది కేవలం ఒక రోలింగ్ మిల్ మాత్రమేనని, సమగ్ర స్టీల్ ప్లాంట్ కాదంటూ ప్రెస్ మీట్లు పెట్టి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. గతంలో ఆయనను తీవ్రంగా వేధించిన, ట్రోల్ చేసిన వైఎస్సార్సీపీ సానుభూతి మీడియా ఛానెళ్లకు, యూట్యూబ్ వేదికలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తూ, కూటమి ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపట్టడం ద్వారా ఆయన పూర్తిగా ప్రత్యర్థి ఫోల్డ్‌లోకి వెళ్లిపోయారనే భావన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత అజెండాలు లేదా ప్రభుత్వంపై పెంచుకున్న తీవ్రమైన అసంతృప్తి వల్ల విచక్షణ కోల్పోయి, లేనిపోని అంశాలపై విమర్శలు చేస్తున్నారనే విమర్శలు ఆయనపై వస్తున్నాయి. గతంలో ఆయన పడిన కష్టాలకు మద్దతుగా నిలిచి, ఆయనను నెత్తిన పెట్టుకున్న టీడీపీ క్యాడర్ ఇప్పుడు ఇలాంటి వ్యక్తినా మనం సమర్థించింది అని తీవ్ర అసంతృప్తితో ఉంది. ఒక మాజీ ఐపీఎస్ అధికారిగా చట్టబద్ధమైన హక్కుల కోసం పోరాడటానికి, రాజకీయ ప్రయోజనాల కోసం మారే వైఖరికి మధ్య ఉన్న సన్నని గీత దాటడం వల్ల ఏబీ వెంకటేశ్వరరావు తన సొంత విశ్వసనీయతను దెబ్బతీసుకున్నారు

# కుప్పం ఎయిర్ పోర్టుపై తమిళ రాజకీయాల్లో చర్చ

తిరుపతి, ఆగస్టు 14 ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో నిర్మించనున్న విమానాశ్రయం ప్రాజెక్టు ఇప్పుడు పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ రాష్ట్రంలోని హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని, దీని వెనుక పొరుగు రాష్ట్రాల ప్రమేయం ఉందనే ఆరోపణలతో తమిళనాడు అసెంబ్లీలో ప్రకంపనలు రేగాయి. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిఎంకే ఎమ్మెల్యే శ్రీనివాసన్ లేవనెత్తిన అంశం రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టును దెబ్బతీయడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కావాలనే అడ్డుపుల్లలు వేస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హోసూరు వంటి కీలక ప్రాంతంలో విమానాశ్రయం రావడం వల్ల పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అయితే పొరుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా ఆ ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారుఈ ఆరోపణలపై తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన స్పందిస్తూ, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను ఖండించారు. పొరుగు రాష్ట్రాలు హోసూరు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసంబద్ధమైన వార్తలను నమ్మి అసెంబ్లీ వేదికపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆమె ఎమ్మెల్యేకు హితవు పలికారు. పరిపాలనాపరమైన సమస్యలను రాజకీయ రంగు పులుమడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు నష్టం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తే, అందులో ప్రధానంగా సాంకేతికపరమైన అడ్డంకులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. హోసూరు ప్రాంతం బెంగళూరుకు భౌగోళికంగా చాలా దగ్గరగా ఉండటం ఒక ప్రధాన సవాలు అంటున్నారు. ఇప్పటికే బెంగళూరులోని కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతానికి సేవలందిస్తోందని, నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన విమానాశ్రయం ఉన్న నిర్దిష్ట పరిధిలో మరొక విమానాశ్రయాన్ని నిర్మించాలంటే అనేక విమానయాన నియమాలను పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనితో పాటు, హోసూరులో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రక్షణ సౌకర్యాలు, అడ్డంకులు విమానాల రాకపోకలకు అనుమతులు లభించడంలో ప్రధాన ఆటంకాలుగా మారాయంటున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో వేగంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. భౌగోళికంగా కుప్పం కూడా బెంగళూరుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలతో ముందడుగు వేసిందని అంటున్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో సమన్వయం చేసుకుని, షరతులతో కూడిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 1,788 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా, ఇప్పటికే దాదాపు 1,300 ఎకరాల భూసేకరణ పూర్తికావడం ప్రాజెక్టు పురోగతికి నిదర్శనంగా చెబుతున్నారు. కుప్పంను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడం ద్వారా చిత్తూరు జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# పాపం గోరంట్ల

అనంతపురం, ఆగస్టు 14 పోలీస్ ఖాకీ డ్రెస్ వదిలి, ఎంపీ గిరీ అనుభవించి ఒక వెలుగు వెలిగిన హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రాజకీయ జీవితం ప్రస్తుతం అత్యంత దిగువ స్థాయికి పడిపోయింది. 2019లో వైఎస్సార్సీపీ తరఫున పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆయన, పదవీకాలంలో వివాదాలతో వార్తల్లో నిలిచారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టికెట్ నిరాకరించిన పార్టీ అధిష్ఠానం, ఆ తర్వాత ఏదో పేరుకే అన్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టింది. అయితే, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా.. పార్టీ తాడేపల్లి ఆఫీసు ఆవరణలో కూడా ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదన్నది ఓపెన్ సీక్రెట్. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గోరంట్ల మాధవ్‌కు అసలు ఒక్క నియోజకవర్గ బాధ్యత కూడా లేదు. పార్టీ హైకమాండ్ ఆయనకు జిల్లాలో ఏ అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పదవినీ అప్పగించలేదు. అధికార ప్రతినిధిగా కనీసం తాడేపల్లిలో ప్రెస్ మీట్లు పెట్టి పార్టీ వాయిస్ వినిపించే అవకాశం కూడా సక్రమంగా దక్కడం లేదనే చర్చ నడుస్తోంది. దీంతో తాను ఇంకా రాజకీయాల్లో ఉనికిలోనే ఉన్నానని ప్రపంచానికి చెప్పుకోవడానికి మాజీ ఎంపీ పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ధర్నా జరుగుతోందంటే చాలు.. పిలవకపోయినా వెళ్లి ప్రత్యక్షమైపోవడం ఆయనకు అలవాటుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల రాప్తాడు నుంచి మొదలుకుని ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి తలపెట్టిన నిరసనల వరకు, పార్టీ ఎక్కడ రోడ్డెక్కినా మాజీ ఎంపీ హడావుడిగానే చేరుకుంటున్నారు. ధర్నాల దగ్గర పోలీసులు అడ్డుకుంటే వారితో వాగ్వాదానికి దిగడం, బలవంతపు అరెస్టులు కావడం, ఆ క్రమంలో కొత్త కొత్త కేసులు మూటగట్టుకోవడం ఆయనకు నిత్యకృత్యంగా మారింది. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ రకమైన ఓవర్ ఆక్షన్ చేస్తున్నారని, ఈ హడావుడి వల్ల ఎలాంటి రాజకీయ లబ్ధి కలగపోగా పోలీసు కేసులు, కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతంలో గౌరవప్రదమైన సీఐ ఉద్యోగాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన గోరంట్ల మాధవ్, ఇప్పుడు ఇటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోస్టు లేక, అటు పార్టీ అధినేత జగన్ ఆశీస్సులు దక్కక తీవ్ర రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఆవేశంగా మాట్లాడటం, ప్రతిదానికీ హైడ్రామా సృష్టించడం తప్పితే సొంతంగా కేడర్‌ను లేదా నియోజకవర్గంలో పట్టును పెంపొందించుకోవడంలో ఆయన విఫలమయ్యారనేది సొంత పార్టీ నేతల భావన. రేపోమాపోఆయన తనను పార్టీ హైకమాండ్ వాడుకుని వదిలేసిందని.. బోరుగడ్డలాగా ధర్నా చేసినా ఆశ్చర్యం లేదన్న భావన వినిపిస్తోంది.

# పెద్దిరెడ్డి మళ్లీ యాక్టివ్...

తిరుపతి, ఆగస్టు 14 మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యాక్టివ్ అయ్యారు. తాజాగా ఆయన అనంతపురం జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ-2025 వ్యతిరేక నిరసనల్లో పాల్గొనేందుకు వెళ్లారు. అయితే.. పోలీసులు ఆయనను మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ పరిణామం సీమ వైసీపీలో కొంత జోష్ నింపిందన్న వాదన వినిపిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా.. పార్టీ పరంగా ఉద్యమాలు చేపట్టినా.. పెద్దిరెడ్డి పెద్దగా యాక్టివ్ కాలేదు. కుటుంబంపై నమోదైన కేసులు ఆయనను ఇబ్బందికి గురి చేశాయన్న వాదన ఉంది ముఖ్యంగా భూములు, మద్యం, అటవీ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారన్న కేసులు కూడా నమోదయ్యాయి. అయితే.. వాటిపై పార్టీ పరంగా ఆయనకు మద్దతు లభించలేదు. దీంతో పెద్దిరెడ్డి కినుక వహించారని.. పార్టీలో కూడా అన్యమనస్కంగా ఆయన ఉంటున్నారన్నది కొన్నాళ్ల కిందటే చర్చకు వచ్చింది. అయితే.. తాజాగా .. పెద్ది రెడ్డి మనసు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోవడం.. నియోజకవర్గంలో కూడా కేడర్ బల హీన పడుతుండడం, నాయకుల మధ్య సమన్వయం సమస్యగా మారుతున్న నేపథ్యంలో ఉద్యమాలకు హాజర య్యారన్న టాక్ వినిపిస్తోంది. పెద్దిరెడ్డి ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలకు మాత్రమే పరిమితం అయ్యారు. గతంలో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. గత 2024 ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలని నిర్ణయించారు. కానీ, ఈ తరహా రాజకీయాలు పనిచేయలేదు. దీంతో గత ఎన్నికల తర్వాత నుంచి పెద్దిరెడ్డి మౌనంగా ఉండిపోయారు. ఒకవైపు మదనపల్లి ఫైల్స్ తగలబడడం, మద్యం కేసు వెంటాడడం, భూముల వ్యవహారంతో తీరికలేకుండా పోయింది. మరోవైపు మరిన్ని కేసులు నమోదవుతాయన్న బెంగ కూడా ఆయనను వెంటాడింది. ఈ పరిణామాల క్రమంలో మౌనంగా ఉన్న పెద్దిరెడ్డి.. తాజాగా యాక్టివ్ కావడం కొంత మేరకు సీమలో వైసీపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఇది కొనసాగుతుందా? లేదా? అనేది చూడాలి. కేవలం తాడిపత్రి వరకే పెద్దిరెడ్డి రాజకీయంగా పరిమితం అవుతారా? అనేది కూడా సందేహంగా మారింది. అయితే.. ఇది కొంత మేరకు సానుకూల పరిణామాలను అందిస్తున్నదన్న సంకేతాలు కూడా ఉన్నాయి. సీమలో పెద్ది రెడ్డి వంటి సీనియర్ యాక్టివ్ కావాలని కోరుకునే వారికి మాత్రం తాజా పరిణామం కొంత మేరకు సంతృప్తిని ఇచ్చిందని అంటున్నారు.

# విశాఖలో ఫుడ్ బ్యాంకులు

విశాఖపట్టణం, ఆగస్టు 14 విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనపై విశాఖవాసులు ప్రశంసలు కురిపిస్తు?న్నారు.

## తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్

తిరుమల, ఆగస్టు 14 తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్ పెడుతూ టీటీడీ కొత్తగా నిర్మించిన రెండు వసతి సముదాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతిలో భక్తుల కోసం నిర్మించిన శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వసతి సముదాయాలలో దాదాపు 10,000 మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. మొత్తం వెయ్యికిపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి.. తిరుమలలో 60 వేల మంది యాత్రికులకు వసతి కల్పించేలా 7600 గదులు, 5 పీఏసీలు ఉన్నాయి. తిరుమలలో ప్రస్తుతం ఉన్న వసతి గదులు భక్తులకు సరిపోవడం లేదు.. అలాగని కొత్తగా అక్కడ సముదాయాలు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ తిరుమలలో వసతి గదులు దొరకకపోతే భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, పద్మావతి అతిథి గృహం ఉన్నాయి. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వసతి గదులు సరిపోవడం లేదు.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా కొత్తగా నిర్మించిన మరో రెండు వసతి సముదాయాలు అందుబాటులోకి రాబోతున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ వెనుక గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన భవనాలు, గదుల నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సమయంలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో, అధునాతన వసతులతో నిర్మిస్తున్నారు. ఈ శ్రీపాదం, అచ్యుత భవనాలు తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు చొప్పున మొత్తం 1064 గదులు ఉంటాయి.. ఈ రెండు సముదాయాలలో కలిపి 10వేల మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. అచ్యుతం, శ్రీపాదం వసతి సముదాయాల్లోని భవనాల్లో రిసెప్షన్, అన్నదానం, డార్మెటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.. దాదాపు 7వేల మంది భక్తులకు సరిపోయేలా లాకర్ల సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది. ఈ రెండు వసతి సముదాయాల నిర్మించాలని 2022లో అప్పటి టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. కానీ నిర్మాణ పనులు 2024 మార్చిలో ప్రారంభంకాగా.. 2026 ఏప్రిల్‌కు పూర్తి చేయాలని భావించారు. కానీ పనులు కాస్త ఆలస్యం కావడంతో బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం -

విజయవాడ, ఆగస్టు 14 ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా లక్షలాది కుటుంబాలను కుంగదీస్తున్న అతిపెద్ద ఆర్థిక కుంభకోణం అగ్రిగోల్డ్ . తమ కష్టార్జితాన్ని దాచుకుని మునిగిపోయిన చిన్న తరహా డిపాజిటర్లకు రాబోయే ఆరు నెలల్లో డబ్బులు చెల్లించడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా వేగవంతం చేయడంతో ఈ సుదీర్ఘ పోరాటానికి ఒక ముగింపు లభిస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు, అధిక వడ్డీల ఆశచూపి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు 6,380 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించాయి. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 19.5 లక్షల మంది బాధితులు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.10,000, రూ.20,000 లోపు ఉన్న చిన్న డిపాజిటర్లకు కొన్ని వందల కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా వేలాది మంది మీడియం, పెద్ద డిపాజిటర్లకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ఉన్నారు. అగ్రిగోల్డ్ గ్రూప్ కొనుగోలు చేసిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లు, నివాస సముదాయాలు, గుంటూరు సమీపంలోని హాయ్‌లాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ వంటి ఆస్తులను సీఐడీ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేశాయి. ప్రెజెంట్ మార్కెట్ వాల్యూ ప్రకారం చూస్తే, ఈడీ, సీఐడీల వద్ద స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ 6,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పారదర్శకంగా విక్రయిస్తే డిపాజిటర్ల బకాయిలు దాదాపుగా చెల్లించడానికి సరిపోతాయని అధికార యంత్రాంగం భావిస్తోంది. గతంలో 2014-19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అగ్రిగోల్డ్ ఆస్తులను ఈ-వేలం ద్వారా విక్రయించి డిపాజిటర్లకు సొమ్ము చెల్లించేందుకు హైకోర్టు పర్యవేక్షణలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు, వారికి అనుకూల వర్గాలు కోర్టుల్లో వివిధ రకాల పిటిషన్లు వేయడం, ఆస్తుల విలువను తక్కువ చేసి చూపుతున్నారంటూ వివాదాలు రేపడం వల్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా దఫాల వారీగా కొంతమందే చెల్లింపులు చేయగలిగింది తప్ప, అటాచ్ చేసిన ప్రధాన ఆస్తులన్నింటినీ వేలం వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోయింది. ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు పంచడం చూడానికి సులువుగా కనిపించినా.. దీని వెనుక సంక్లిష్టమైన లీగల్ చిక్కులు ఉన్నాయి. పీఎంఎల్ఏ చట్టం కింద ఈడీకి ఉన్న హక్కులు, రాష్ట్ర సీఐడీ పరిధిలోని చట్టం కింద ఉన్న అటాచ్‌మెంట్ల మధ్య సమన్వయం సాధించి ఆస్తులను రిలీజ్ చేయించడం. అగ్రిగోల్డ్ యాజమాన్యం వివిధ బ్యాంకుల వద్ద ఆస్తులను కుదువబెట్టి రుణాలు తీసుకుంది. వాటి కోసం డెట్ రికవరీ ట్రిబ్యునల్ ద్వారా బ్యాంకులు తమకే మొదటి హక్కు ఉందంటూ హైకోర్టును ఆశ్రయించాయి. కంపెనీ ప్రమోటర్ల కుటుంబ సభ్యులు, బినామీల పేర్లపై పెట్టిన ఆస్తులపై వచ్చిన లీగల్ ఛాలెంజెస్ ను కూడా అధిగమించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కోర్టుల ఏర్పాటును వేగవంతం చేసి, కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా బాధితుల డేటాబేస్‌ను సరి చూస్తోంది. పెద్ద పెద్ద ల్యాండ్ పార్సెళ్లను చిన్న ప్లాట్లుగా విభజించి వేలం వేయడం ద్వారా ఎక్కువ రాబడి రాబట్టవచ్చని ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం గనుక చట్టపరమైన అడ్డంకులను అధిగమించి, రాబోయే ఆరు నెలల గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేసి డిపాజిటర్ల చేతికి డబ్బులు అందిస్తే.. అది ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. దశాబ్ద కాలంగా నమ్మకం కోల్పోయిన లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది కొండంత అండగా మారడమే కాకుండా.. కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా మైలేజ్ తెచ్చిపెడుతుంది.





# జిల్లాలో ఎరువుల కొరత లేదు - కలెక్టర్ గరిమా అగర్వాల్

**. అధికారిక ధరలకే విక్రయించాలి**

**. షాపుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**

**ఎరువుల సరఫరాపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 14(ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువుల కొరత ఏమాత్రం లేదని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎరువుల సరఫరా, నిర్వహణపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.




ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుత సాగుకు అవసరమైన అన్ని రకాల ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని రైతులకు భరోసా ఇచ్చారు. పంటల సాగుకు అనుగుణంగా అవసరమైన ఎరువుల నిల్వలను స్థానికంగానే ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన నిర్దిష్ట ధరలకే విక్రయించాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని అన్ని ఎరువుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్ తదితర అధికారులు పాల్గొన్నారు.




# తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి!

హైదరాబాద్, ఆగస్టు 14 తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

# గ్రేటర్ పోరులో పార్టీలు...

హైదరాబాద్, ఆగస్టు 14 తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు.ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

# ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 14 తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమెటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

## వర్క్ ఫ్రమ్ హోం పేరిట సైబర్ మోసాలు
## చైనా లింకులను గుర్తించిన పోలీసులు

న్యూఢిల్లీ వర్క్ ఫ్రమ్ హోమ్' ఉద్యోగాల పేరుతో రూ.12 లక్షలు కాజేసిన చైనా లింకులున్న సైబర్ మోసాన్ని ఢిల్లీ పోలీసులు గుట్టురట్టు చేశారు.
గురుగ్రామ్, గాజియాబాద్, నోయిడా, ఇటావాలో దాడులు చేసి ఎంబీఏ, బీకామ్ చదివిన నలుగురిని అరెస్ట్ చేశారు.
బాధితుల డబ్బును మ్యూల్ ఖాతాల ద్వారా మళ్లించి 'జూఆ' క్రిప్టోకరెన్సీగా మార్చి టెలిగ్రామ్ ద్వారా చైనాకు ట్రాన్స్ఫర్ చేస్తున్నట్లు గుర్తించారు.
నిందితుల నుంచి 9 పాస్బుక్లు, 5 సిమ్ కార్డు, 6 మొబైళ్లు, కమిషన్ రిజిస్టర్ను స్వాధీనం చేసుకున్నారు.

# రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది

హైదరాబాద్, ఆగస్టు 14 రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది. కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బిఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

# తెలంగాణలోనూ మఖానా సాగు

హైదరాబాద్, ఆగస్టు 14 వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. తెలంగాణలో విజయవంతమైన ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి బిహార్ ఆసక్తి చూపగా.. బిహార్‌లో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. సెక్రటేరియట్‌లో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిహార్ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా భేటీ అయి.. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది. ఈ మేరకు బిహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగం, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, కొత్త పంటల సాగు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల అభివృద్ధి, పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుపై బిహార్ మంత్రి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో 2025?26లో సుమారు 3.1 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నమూనాను పరిశీలించేందుకు బిహార్ నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపనున్నారు. మరోవైపు బిహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంటపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ముడి ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బిహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ భావిస్తోంది. బిహార్‌లో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక పంట క్లస్టర్లను అభివృద్ధి చేసిన విధానాన్ని ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా.. బిహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది.

# మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

మహబూబ్ నగర్, ఆగస్టు 14 మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది.

ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది.

దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది. దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన న ష్ట ప రి హా రం ని నిర్ణయించనున్నారు. పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు రికవరీ

హైదరాబాద్ పాతబస్తీ ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాలలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితుల ఫిర్యాదు రావడంతో అ ఫిర్యాదు పై ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, ఛత్రినాక డిఐ, కృష్ణమూర్తి నాయుడు, డిటెక్టివ్ ఎస్సై, మహమ్మద్ మాజీద్ అలీ, తో పాటు క్రైమ్ టీం సిబ్బంది కలిసి ,మొబైల్ ఫోన్ యొక్క ఐ,ఎం,ఈ, ఐ ,నెంబర్ ప్రకారం కొత్తగా వచ్చిన (సి,ఐ,ఆర్ )ప్రోటల్ ద్వారా (21)ఫోన్లను రికవరీ చేసి వాటికి సంబంధించిన వ్యక్తులను ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, డిఐ, కృష్ణమూర్తి నాయుడు చేతుల మీదుగ (21) మంది బాధితులకు సెల్ ఫోన్లు అందజేశారు.

# టార్గెట్ రేవంత్...

హైదరాబాద్, ఆగస్టు 14 తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణల పర్వం కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నేరుగా విమర్శలు చేయడం కంటే, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన సోదరులను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు సాధారణంగా తెర వెనుక ఉంటారు. తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటుండగా, కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిద్దరినీ ఇప్పుడు బీఆర్ఎస్ తమ పొలిటికల్ అటాక్‌కు కేంద్రబిందువుగా మార్చుకుంది. తాజాగా ఈ పొలిటికల్ వార్ టెస్సరాక్ట్ అనే కంపెనీకి జరిగిన భూ కేటాయింపుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిందని, అసలు ఆ టెస్సరాక్ట్ కంపెనీ కొండల్ రెడ్డి బినామీ సంస్థ అని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి సొంత సోదరుడికి భారీగా లబ్ధి చేకూర్చారని ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియా, మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థాయి స్కామ్‌లకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ శ్రేణులు నెరేటివ్‌ను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. బీఆర్ఎస్ చేస్తున్న ఈ తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, మంత్రులు ఎవరూ ఈ వివాదంపై పెద్దగా స్పందించకపోవడం ప్రతిపక్షాల ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని డిఫెండ్ చేసే ప్రయత్నం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక విధానం ప్రకారం ఎలాంటి నిబంధనలతో భూములు కేటాయించారో, ఇప్పుడు కూడా సరిగ్గా అదే చట్టబద్ధమైన రూల్స్ పాటిస్తూ పారదర్శకంగా భూములు ఇచ్చామని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, ఇక్కడే కాంగ్రెస్ వ్యూహాత్మక లోపం బయటపడుతోంది. పారిశ్రామిక అవసరాల కోసం ఇచ్చిన భూములను కేవలం ఆ నిర్దేశిత ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీల నిర్మాణాలకు మాత్రమే ఉపయోగించాలి తప్ప, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా అవకాశం ఉండదు. ఈ పాయింట్‌ను కాంగ్రెస్ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. భూములు ఎవరికి ఇచ్చినా అందులో స్కామ్ చేసే ఆస్కారం లేదని టెక్నికల్‌గా వివరించడంలో అధికార పక్షం విఫలమవుతోంది. సదరు టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ శ్రేణులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులు కానీ ధైర్యంగా ఖండించలేకపోతున్నారు. బీఆర్ఎస్ ప్రధానంగా కొండల్ రెడ్డి పేరును వాడుకుని దీనిని ఫ్యామిలీ స్కామ్ గా బ్రాండ్ చేస్తోంటే.. కాంగ్రెస్ మాత్రం కేవలం విధానపరమైన నిబంధనల గురించి మాత్రమే మాట్లాడుతోంది తప్ప, అసలు ఆ కంపెనీ ఓనర్ల వెనుక కొండల్ రెడ్డి ఉన్నారా లేదా అనే దానిపై క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కచ్చితమైన ఖండన లేకపోవడం వల్లే బీఆర్ఎస్ తమ ప్రచారంలో మరింత దూకుడు పెంచుతోంది. కేటీఆర్ అండ్ కో ఈ ఇష్యూ ద్వారా రెండు ప్రయోజనాలను ఆశిస్తున్నారు. ఒకటి.. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబం కూడా అదే చేస్తోందని ముద్ర వేయడం. రెండు.. సీఎం ఇమేజ్‌ను డ్యామేజ్ చేసి, ప్రభుత్వంపై నెగెటివిటీ పెంచడం. కాంగ్రెస్ పార్టీ ఈ ఆరోపణల దాడిని కేవలం మంత్రుల ప్రకటనలకే పరిమితం చేయకుండా, వాస్తవాలను డాక్యుమెంట్ల సహా ప్రజల ముందు ఉంచి కౌంటర్ అటాక్ చేయకపోతే.. దీర్ఘకాలంలో ఇలాంటి చిన్న సైజు స్కామ్ ఆరోపణలే ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.

## 15 ఆగస్టు నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో తనిఖీలు



సికిందరాబాద్ 15 ఆగస్టు నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి పోలీసుల విస్తృత చెకింగ్ జరిపారు. రైల్వే స్టేషన్లో ప్రయాణికులు, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక నిఘా వుంచారు. 15 ఆగస్టు సందర్భంగా పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేసారుఉ. సికింద్రాబాద్ ఆర్పీఎస్ ఇన్స్పెక్టర్ బి. సాయిశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి

## భగత్ సింగ్ నగర్ లో అర్ధరాత్రి పోలీసుల కార్డెన్ సర్చ్

సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లో అర్ధరాత్రి పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. సిపి ఆదేశాలతో ఎల్బీనగర్ డిసిపి ఆధ్వర్యంలో ఈ గార్డెన్ సర్చ్ జరిగింది. ఇందులో 33 అనుమతులు లేని చక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంతేకాదు చలాన్లు ఉన్న వెహికల్ లను గుర్తించి వారి నుండి చలాన్లు వసూలు చేసినట్టు డీసిపి తెలియజేశారు. అంతేకాకుండా అనుమానితులను అలాగే రౌ డి షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డిసిపి తెలియజేశారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యం బాటిలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. గుట్కా ప్యాకెట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు..

# అంగరంగ వైభవంగా శ్రీ మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ

### ఆవిష్కరణలో పాల్గొన్న కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

రంగారెడ్డి షాద్‌నగర్‌లో వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో, బొబ్బిలి ప్రవీణ్ నేతృత్వంలో శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... మహానీయుడు, భగవత్ స్వరూపుడైన శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహాన్ని షాద్‌నగర్‌లో ప్రతిష్ఠించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమానికి కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య హాజరు కావడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ శు భాకాంక్షలు తెలిపారు. బసవేశ్వరుడు కారణజన్ముడని, సమాజంలోని అసమానతలను తొలగించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లింగ, మత, కుల వివక్షకు తావులేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనను ఆయన ఆనాడే చాటిచెప్పారని అన్నారు. మానవత్వంతో మెలుగుతూ సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలన్న బసవేశ్వరుడి సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. ఆయన ఆశయాలను పాటిస్తే సమాజంలో శాంతి, సమానత్వం నెలకొంటాయని పేర్కొన్నారు. కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం అధ్యక్షతన శ్రీ మహాత్మ బసవేశ్వర స్వామి విగ్రహావిష్కరణ జరగడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తుడిపై కాశీ విశ్వేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. మహాత్మ బసవేశ్వరుడు దేవుడి స్వరూపంగా జన్మించి సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారని జగద్గురు కొనియాడారు. ఆయన చూపిన మార్గం కేవలం కర్ణాటక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా సమాజ అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానమే అనే బసవేశ్వరుడి సిద్ధాంతాలను ప్రజలు ఆచరించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి చిన్నచిన్న గ్రామాల వరకు ప్రముఖ క్షేత్రాలు, ప్రాంతాల్లో బసవేశ్వరుని విగ్రహాలు ఉండాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. షాద్‌నగర్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన బొబ్బిలి ప్రవీణ్, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు, పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విషాదంగా మారిన తీర్థయాత్ర

నిజామాబాద్ తీర్థయాత్ర విషాదంగా మారిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ నుంచి హైదరాబాద్‌లోని చిన్నజీయర్ స్వామి తీర్థయాత్రకు రెండు బస్సుల్లో భక్తులు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న బస్సు టైర్ పంచర్ కావడంతో రెండు బస్సులు హైవేపై నిలిచిపోయాయి.

# డివైడర్ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు



మహబూబ్నగర్ జిల్లా 44వ జాతీయ రహదారిపై భూత్పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి పాండిచ్చేరి వెళ్తున్న బస్సు డివైడర్నర్ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఘటనలో పదిమందికి గాయాలు అయ్యాయి. నలుగురి పరిస్థితి సీరియస్ గా వేంది. అందరిని జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు వున్నారు. ఎస్పీ జానకి .. ఘటన స్థలాన్ని పరిశీలించారు.

# మిల్లర్ల గోడువినేది ఎవరు ?

### బియ్యం రాక మిల్లర్ల నరకయాతన. ధాన్యం కొనుగోలు మిల్లర్లు చేస్తేనే మేలు.

హన్మకొండ .ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం దిగుబడి రాక మిల్లర్లు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల మెడపై కత్తి పెట్టి ధాన్యం దిగిమతి చేయిస్తుందన్నారు. ఎవరో కొంతమంది మిల్లర్లు చేసిన పొరపాటు వలన జిల్లాలోని మిల్లర్లు అందరిపై ఆర్థిక భారం పడుతుందని దాని వలన ఆయా కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని కొంతమంది మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల వద్ద నుండి బ్యాంకు డిపాజిట్ పేరుతో లక్షల రూపాయలని ముందస్తుగా వసూలు చేస్తుందన్నారు. బ్యాంకులలో డిపాజిట్ చేసిన మిల్లర్లకే ప్రభుత్వం ధాన్యం దిగుమతికి అవకాశం ఇస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల హన్మకొండ జిల్లాలోని శాయంపేట మండలంలోని రైస్ మిల్ పై సంబంధిత అధికారులు దాడి చేసి ధాన్యం లోటును గుర్తించారు. ఆ క్రమంలో ఆ మిల్లుల నిర్వహకులను ఇటీవల జైలుకు పంపిన విషయం తెలిసింది. 2024 , 2025 , 2026 సంవత్సరానికి గాను ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఆ మిల్లులు ప్రభుత్వం ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతి దిగుమతి చేసుకున్నాయి. వర్షాకాలంలో దిగుమతి చేసుకున్న వారి ధాన్యం నాణ్యత పరంగా బాగుంటుందని మిల్లర్లు అంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి క్వింటల్ ధాన్యానికి 68 కిలోల బియ్యం రావడం కష్టమని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి మిల్లరు ఆ లోటును పూడ్చడానికి తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలు ఉన్నాయని అంటున్నారు. ఒక్కోసారి ఆ లోటును పూడ్చలేక ఇల్లు భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లో అంటున్నారు. ఎంత ఎక్కువగా ధాన్యాన్ని దిగిన చేసుకుంటే అంత ఎక్కువగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. ధాన్యాన్ని పట్టే సమయంలో వచ్చే తౌడు , ఉను క ,నూకలు , పరం లాంటి వస్తువులను బయట అమ్మి లోటును పూడ్చవలసిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లు అంటున్నారు. ధాన్యాన్ని పట్టే క్రమంలో విద్యుత్ చార్జీ మిల్లులో పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఉంటున్నాయని మిల్లర్లు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న కమిషన్ సకాలంలో మిల్లర్లకు అందించినట్లయితే నెత్తిపై పడే భారాన్ని కాసింత తగ్గించుకోవచ్చని మిల్లర్లు తెలిపారు. ధాన్యం కొనే అవకాశం మిల్లులకే ఇవ్వాలి.

రైతులు పండించిన పరిధాన్యాన్ని కకొనుగోలు చేసే అవకాశం మిల్లులకు ఇవ్వాలని మిల్లర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దానివలన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని మిల్లర్లు తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం మిల్లర్లు వచ్చే కొనే అవకాశం ఇచ్చినట్లయితే నష్టం తాలూకు భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఐకేపీ ద్వారా కొనే విధానం వలన కొన్ని సెంటర్లలో రాజకీయ ప్రమేయాలు చోటుచేసుకుని నాణ్యమైన ధాన్యం దిగుమతి కాకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే నాణ్యమైన ధాన్యాన్ని రైతులు మిల్లర్ల వద్దకు తేవడం లేదని పేర్కొన్నారు. రైతుల పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం కొనుగోలు చేయకపోయినా వాటి అనుమతులను రద్దు చేయాలని కొంతమంది మిల్లర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారు. రైతులు ధాన్యం పూర్తిగా ఎండకు ముందే మిల్లర్లకు తేవడం వల్ల వాటిలో దిగుమతి రావడం లేదని పేర్కొన్నారు. డిపాజిట్ రూపంలో అదనపు భారం. ధాన్యం దిగుమతి చేసుకోవాలంటే ప్రతి మిల్లర్ విధిగా బ్యాంకులో డిపాజిట్ చేయాలన్న నిబంధన మిల్లర్ల పాలిట గుదిబండగా మారింది అంటున్నారు. దిగుమతి చేసుకున్న ధాన్యములో 10% బ్యాంకులో డిపాజిట్ చేస్తేనే ప్రభుత్వం అనుమతినిస్తుందని వారు తెలిపారు. మిల్లుల నిర్వహణ గతంతో పోలిస్తే కష్టసాధ్యంగా మారిందని యజమానులు ఆపోతున్నారు. రైతులకు నష్టం జరగకుండా మిల్లు యజమానులకు నష్టాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని కొంతమంది మిల్లర్లు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తున్నారు

### ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి రాజగోపాల్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది తానేనని, అందుకే అప్పటి సీఎం కేసీఆర్ తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. మునుగోడు ఉపఎన్నికలో తనను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించినా, దానిని కూడా తాను ఒక విజయంగానే భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. ఏపూరి సోమన్న పాడిన 'ఎవరి పాలైందిరో తెలంగాణ' పాటలో ప్రస్తావించిన పరిస్థితులే నేటికీ కొనసాగడం బాధాకరమన్నారు. సోమన్న రూపం, గళం చూస్తే దివంగత ప్రజాగాయకుడు గద్దర్ గుర్తుకొస్తారని పేర్కొన్నారు.

ఏపూరి సోమన్న వంటి కళాకారులు, ఉద్యమకారులకు తాను అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సోమన్న చట్టసభల్లో అడుగుపెడతారని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రాజకీయాలను మార్చే శక్తి తనకు ఉందని, నిజాయితీ కలిగిన వారు తన వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. పదవులు కిరీటాలు కావని, ప్రజలకు సేవ చేసే అవకాశం మాత్రమేనని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

## తారామతిపేట్ గ్రామం సర్వే నంబర్ 36లోని భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాల

ప్రభుత్వ రికార్డులను నమ్మి భూములు కొనుగోలు చేసిన బీసీ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల భూములను ప్రభుత్వం గుంజుకుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. బాధితుల సమస్యలు పరిష్కరించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట్ గ్రామం సర్వే నంబర్ 36లోని భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వ రికార్డులు, సర్వే స్కెచ్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసిన భూమిని ఇప్పుడు ఓఆర్ఆర్ లేదా ప్రభుత్వ భూమిగా చూపడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. 2005లో ఓఆర్ఆర్ కోసం భూసేకరణ జరిగితే అనంతరం రిజిస్ట్రేషన్లు, సర్వే స్కెచ్ ఎలా జరిగాయో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. భూమి హద్దులు, ప్రీకాస్టింగ్ గోడను కొందరు తొలగించారని ఆరోపించిన ఆయన.. పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమి విక్రయదారు నందనూరి కిరణ్‌సాగర్, కొనుగోలుదారు చిలువేరు కిరణ్ తమకు జరిగిన ఇబ్బందులను వివరించారు.

# సత్తుపల్లిలో ఘనంగా బీజేపీ తిరంగా ర్యాలీ...

## 500 అడుగుల భారీ జాతీయ పతాకంతో కదం తొక్కిన విద్యార్థులు, జాతీయవాదులు



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 14:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో భారీ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, జాతీయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సుమారు 500 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని చేతబూని పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీతో సత్తుపల్లిలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు దేశ పౌరులంతా ఐక్యతను చాటాలని, జాతి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీ విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో పాటు భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇవీ రమేష్ మాట్లాడుతూ.. యువతలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపడంతో పాటు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు నివాళులు అర్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను నేటి తరాలకు పరిచయం చేయడంలో తిరంగా ర్యాలీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు, సుదర్శన మిశ్రా, జిల్లా కార్యదర్శి పాలా నాగ సురేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్ రావు, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ రహ్మతుల్లా, సత్తుపల్లి మండల ప్రభారి అల్లిక అంజయ్య, తిరుమలాయపాలెం మండల ప్రభారి నల్లమోతు నాని బాబు, సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్, సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ, వేంసూరు మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్ రెడ్డి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన శ్రీ లక్ష్మీ శ్రీనివాస పూజ జనరల్ స్టోర్స్ ప్రారంభం

## అన్ని రకాల పూజ సామగ్ని అందిస్తామన్న ప్రొపరేటర్ శ్రీనివాస్.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 ప్రజాబలం:** ఖమ్మం టౌన్ పరిధిలోని ఖానాపురం కొలిపాక ఫంక్షన్ హాల్ లైన్లో నూతన శ్రీ లక్ష్మీ శ్రీనివాస పూజ జనరల్ స్టోర్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు హాజరై ఖానాపురం చుట్టుపక్కల కాలనీలకు దగ్గరలో పూజ సామాగ్రి షాపును ప్రారంభించడం చాలా సంతోషమని ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.. అనంతరం స్టోర్ యజమానులు శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని రకాల పూజలకు శుభకార్యాలకు, వివాహాలకు, గృహప్రవేశాలకు, శంకుస్థాపనలకు, వ్రతాలకు, పడిపూజలకు పూజ సామాగ్ని సరసమైన ధరలకు అందిస్తామని, రాగి ఇత్తడి నవధాన్యాలు కూడా అందిస్తామని తెలియజేశారు. కావున భక్తులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 14, కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితే..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది.ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి.ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది.సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉంటారు. వారు ఒక ఫుడ్‌ను ఇమ్యూనిటీ పెంచుతుంది.. ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది లేదా ఆరోగ్యానికి ఎంతో మంచిది అని చెబితే, చాలామంది వినియోగదారులు దాన్ని నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ఫాలోవర్లను ప్రభావితం చేసే వ్యక్తులు ఉత్పత్తి గురించి చెప్పే ప్రతి ఆరోగ్య క్లెయిమ్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

# మంత్రి పొంగులేటిపై కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన లక్ష్మారెడ్డి



**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 14 ప్రజాబలం:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా గొడుగునూరు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి మాటలు మాట్లాడేటప్పుడు ఒక వ్యక్తిపై నిజాలు తెలుసుకొని మాట్లాడాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు తగిన రాజకీయ సమాధానం ఇస్తారు" అని హెచ్చరించారు తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని అన్నారు.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వయస్సులో పెద్దవారిని గౌరవించే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని, ఆయనను కించపరిచేలా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక పేరు మాత్రమే కాదు ప్రజలకు కష్టకాలంలో అండగా నిలిచే ఒక బ్రాండ్. ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం చేయాలనే గొప్ప మనసున్న నాయకడు అని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ పార్టీ తరఫున తాము ఎక్కడికి రావాలో, ఎప్పుడు రావాలో కౌశిక్ రెడ్డి సమయం, తేదీ ప్రకటించాలని సవాల్ విసిరారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.ప్రజలు ఎవరిని ఆదరిస్తున్నారో రాబోయే రోజుల్లో ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తాయని అన్నారు.

కెసిఆర్ ప్రభుత్వంలో మీరు ఇచ్చిన ఇల్లు ఎన్ని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు మరోసారి మంత్రులు లేదా కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజకీయంగా దీటైన సమాధానం ఇస్తాం. ప్రజలే అంతిమ నిర్ణేతలు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా అధికారంలోకి వస్తుంది" అని గొడుగునూరు లక్ష్మారెడ్డి అన్నారు.

# ములుగు నియోజకవర్గంలోని 108 గ్రామాలు, ఆవాసాల్లో మిషన్ భగీరథ పనులకు ప్రభుత్వం ఆమోదం

## తాగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.20.96 కోట్ల మంజూరు

**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి ఆగస్టు 14** ములుగు జిల్లాములుగు జిల్లా, మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడెం, గంగారం మండలాలతో కలిపి 108 గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు మిషన్ భగీరథ పథకం కింద రూ.20 కోట్ల 96 లక్షల 49 వేలతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో నెం.428ను విడుదల చేసింది. గ్రామాల్లో అదనపు, ప్రత్యామ్నాయ తాగునీటి సౌకర్యాల కల్పనలో భాగంగా ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, బోర్‌వెల్లు తదితర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

పనులు ప్రారంభించే ముందు భూగర్భ జలాల లభ్యతపై సమగ్ర సర్వే నిర్వహించాలని, సాంకేతిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే గ్రామ పంచాయతీలతో సమన్వయం చేసుకుంటూ పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించింది.

మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది. ఈ పనులు పూర్తయిన అనంతరం ములుగు నియోజకవర్గంలోని గ్రామాలు, ఆవాసాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

# పోడు భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా మాజీ మంత్రి జలగం ప్రసాదరావు



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 14:** గిరిజన, దళిత, బడుగు వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు ఆశయాలను కొనసాగిస్తున్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావును గంగాదేవిపాడు గ్రామానికి చెందిన ఆయన అభిమానులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా గంగాదేవిపాడు గ్రామానికి సంబంధించిన పోడు భూముల సమస్యలపై జలగం ప్రసాదరావుతో వారు చర్చించారు. పోడు భూములకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామస్తుల సమస్యలను సానుకూలంగా విన్న జలగం ప్రసాదరావు.. పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో మాట్లాడి, త్వరలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గిరిజన, దళిత, బడుగు వర్గాల సంక్షేమం కోసం సర్దార్ జలగం వెంగళరావు చేసిన సేవలను ఈ సందర్భంగా అభిమానులు స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో గంగాదేవిపాడు గ్రామానికి చెందిన జలగం ప్రసాదరావు అభిమానులు పాల్గొన్నారు.

# ధర్నా చౌక్ దగ్గర అయూష్ వైద్య విద్యార్థుల ధర్నా

హైదరాబాద్ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పదేండ్ల కాలం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల ప్రజా పరిపాలనకు దగ్గర వస్తున్నా కూడా తెలంగాణ ఆయుష్ హౌస్, జూణ వైద్యులు, హోమియోపతి, అల్లోపతి వైద్యులకు స్టైఫండ్ లను ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం ఎందుకు చేస్తుందని తెలుగుదేశం అధికార ప్రతినిధి జోత్స్న ప్రశ్నించారు.

హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ఆయుష్ వైద్యులు మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పలు పార్టీ నాయకులు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అధికార ప్రతినిధి జ్యోత్స్న మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉండి ప్రజలకు వైద్యం అందిస్తున్న ఆయుష్ వైద్యులకు స్టైఫండ్ పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదని ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుండి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లు విద్యార్థులపై చిన్న చూడటం సరికాదన్నారు. ఎన్సీఐసీయూ (నిఇతిఇబీ) స్టైఫండ్ ఇవ్వాలని అనుమతులు ఇచ్చిన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ వద్ద బడ్జెట్ లేదని ఇవ్వలేమని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. పక్క రాష్ట్రంలో 68 వేల స్టైఫండ్ ఇస్తే మన రాష్ట్రంలో ఇవ్వకపోవడం ఏమిటని నిలదీశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్టైఫండ్ పెంచి ఇవ్వాలని అలాగే పెండింగ్ బకాయిలను కూడా తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

# ICFAI లా స్కూల్ హైదరాబాద్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా శ్రీకారం

**ICFAI లా స్కూల్, హైదరాబాద్, (ప్రజాబలం ప్రతినిధి)** IFHEలో స్వాతంత్ర్య దినోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని మెరాకి కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో దేశభక్తి ఉత్సాహంతో ఘనంగా వేడుకలు నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) ఎ. వినయ్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ (డా.) ఎస్. విజయలక్ష్మి, డీన్



ప్రొఫెసర్ (డా.) ప్రతాప్ రెడ్డి, అసిస్టెంట్ డీన్ డా. ఎ. అరుణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమానికి మరింత గౌరవాన్ని, ప్రోత్సాహాన్ని అందించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను, సృజనాత్మకతను చాటుతూ వివిధ దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సంగీతం, నృత్యం, వెస్టర్న్ సోలో, గ్రూప్ పెర్ఫార్మెన్స్, స్కిట్ తదితర కార్యక్రమాలు స్వాతంత్ర్యం, ఐక్యత, దేశభక్తి మరియు జాతీయ గర్వం వంటి అంశాలను ప్రతిబింబించాయి.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) ఎ. వినయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం మరియు దేశ నిర్మాణం పట్ల నిబద్ధతను పెంపొందించుకోవాలని ప్రేరణనిచ్చారు.

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ (డా.) ఎస్. విజయలక్ష్మి స్వాతంత్ర్య దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, స్వేచ్ఛతో పాటు ప్రతి పౌరుడిపై వచ్చే బాధ్యతలను గుర్తుచేశారు.

కార్యక్రమం ముగింపులో మెరాకి క్లబ్ కోఆర్డినేటర్ డా. రేణు బాలా కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం కార్యక్రమం దేశభక్తి, ఐక్యత మరియు జాతీయ గర్వంతో నిండిన వాతావరణంలో జరిగింది.

ఈ వేడుకల్లో విద్యార్థులు చింత స్థిత, సారా ప్రీతిక మరియు స్వేజన్ రావూరి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు.

మెరాకి కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు IFHEలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఉత్సాహభరితమైన వాతావరణాన్ని సృష్టించాయి. విద్యా ప్రతిభతో పాటు విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు జాతీయ విలువలను పెంపొందించడంలో సంస్థ చూపుతున్న నిబద్ధతకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలిచింది.

# మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు విస్తృత చర్యలు

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 14: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో క్షయ వ్యాధి (TB) నియంత్రణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా "స్వాస్థ్య నగరం స్టీరింగ్ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం" నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (DM&HO) డా. కె. ఆనంద్ పాల్గొని, జిల్లాలో కొనసాగుతున్న క్షయ వ్యాధి ఇంటింటి క్రియాశీల కేసుల గుర్తింపు కార్యక్రమం, పరిశోధన పురోగతిపై సమీక్షించారు.



పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం మున్సిపాలిటీల పరిధిలోని 72 వార్డుల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధిని నిర్ధారించడం ఈ సర్వే ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు.

క్షయ అనుమానితులను గుర్తించేందుకు రెండు రకాల స్క్రీనింగ్ విధానాలను అమలు చేస్తున్నారు. మొదటి విధానంలో పోర్టబుల్ ఎక్స్‌రే పరికరాల ద్వారా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తుండగా, రెండో విధానంలో క్వాంటిఫెరాన్-TB (క్వాంటిప్లస్) పరీక్ష ద్వారా స్క్రీనింగ్ చేస్తున్నారు. స్క్రీనింగ్‌లో అనుమానితులుగా గుర్తించిన వారికి తదుపరి నిర్ధారణ కోసం చీూూు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ, పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి కుటుంబం ఇంటింటి సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన వివరాలు అందించి, సూచించిన పరీక్షలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, నిర్ధారణ అనంతరం తగిన చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

ఎంపిక చేసిన మున్సిపల్ ప్రాంతాల్లో సమాజవ్యాప్తంగా క్రియాశీల ాదీ కేసులను గుర్తించేందుకు చేపడుతున్న ఈ పరిశోధనలో రెండు విభిన్న స్క్రీనింగ్ విధానాల ప్రభావాన్ని అంచనా వేయడం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. సమావేశంలో పరిశోధనకు సంబంధించిన మధ్యంతర విశ్లేషణ, అధ్యయన ప్రక్రియ, చికిత్సా దశల విశ్లేషణ, గుణాత్మక సమాచారంతో లభించిన అంశాలపై చర్చించారు.

అలాగే పరిశోధన నాణ్యతను మెరుగుపరిచేందుకు సిబ్బందికి శిక్షణ, అవగాహన మరియు కమ్యూనికేషన్ కార్యక్రమాలు (ACSM), సమాచార నిర్వహణ వ్యవస్థ (MIS) తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం, ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని డా. కె. ఆనంద్ అన్నారు. ఇంటింటి సర్వే ద్వారా అందుతున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని అవసరమైన పరీక్షలు చేయించుకుని తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలని కోరారు.

సమావేశంలో కమిషనర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. STO, STDC డైరెక్టర్ డా. రాజేశం, PO-NTEP డా. శ్రీదేవి, ది యూనియన్ సంస్థ హెడ్ ఆఫ్ ప్రోగ్రామ్స్ డా. అర్చనా బెరి తదితర అధికారులు, సాంకేతిక మరియు కార్యక్రమ నిపుణులు పాల్గొన్నారు.

# వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరంలో గంజాయి సప్లై..

## ఈగల్ పోలీసుల ఆపరేషన్

హైదరాబాద్ వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరంలో గంజాయి సప్లై పై వచ్చిన సమాచారంలో ఈగల్ పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బేగంపేట్ ఓల్డ్ ఎయిర్పోర్ట్ వద్ద అనుమానితుడి అరెస్ట్ చేసి, 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కిరణ్, దుర్గాప్రసాద్, కమలాకర్ పేర్లు వెలుగులోకి వచ్చాయి. దాంతో బాలానగర్ రాజీవ్ కాలనీలో నిందితులపై నార్కోటిక్ టీమ్స్ దాడులు నిర్వహించాయి. వచ్చిన పోలీసులపై స్క్రూడ్రైవర్తో దాడికి నిందితుడు కిరణ్ ప్రయత్నించాడు. నాలుగో ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్య డ్రామా ఆడాడు. కిరణ్ నుంచి 14 కేజీల గంజాయి, ఎయిర్గన్, కారు, బైక్, మొబైల్ ఫోన్లు సీజ్ చేసారు. ఒడిశా నుంచి నగరానికి గంజాయి సరఫరా చేసినట్లు గుర్తించారు.

# భూభారతి రీసర్వేకు ప్రజలు సహకరించాలి

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 11 గ్రామాల్లో భూముల రీసర్వే



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 14:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వేకు ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి కోరారు.

శుక్రవారం మేడ్చల్ మండలం కిష్టాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే జరుగుతున్న తీరును, అధికారులు చేపడుతున్న చర్యలను ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో మొత్తం 11 గ్రామాల్లో భూభారతి భూముల రీసర్వే కొనసాగుతోందని అదనపు కలెక్టర్ తెలిపారు. మేడ్చల్, ఘట్కేసర్, కీసర మండలాల్లో మూడు గ్రామాల చొప్పున, మూడుచింతలపల్లి, శామీర్‌పేట్ మండలాల్లో ఒక్కో గ్రామంలో రీసర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రీసర్వే ప్రక్రియలో భాగంగా భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ రికార్డులను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూ యజమానులు అధికారులు నిర్వహించే సర్వేకు అవసరమైన సహకారం అందించాలని, తమ భూములకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఈ సందర్భంగా మేడ్చల్ మండల తహసీల్దార్ భూపాల్, కిష్టాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేకు సంబంధించిన వివరాలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వివరించారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

## ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హెచ్చరిక



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 ప్రజాబలం:** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ, పెన్షనర్ల, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్పీసీ) ప్రతినిధులు హెచ్చరించారు. ఈ మేరకు డిమాండ్ల సాధన కోసం యుఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాలుగు దశల పోరాట కార్యక్రమానికి పిలుపునిచ్చింది. మొదటి దశలో భాగంగా ఈనెల 7న అన్ని పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రెండవ దశలో భాగంగా గురువారం ఏన్కూరు మండల తహసిల్దార్ శేషగిరిరావు ద్వారా ముఖ్యమంత్రికి మెమోరండం అందజేశారు. అనంతరం యుఎస్పీసీ నాయకులు డిఎస్. నాగేశ్వరరావు, వెంకటప్పయ్య, హతీరామ్ మాట్లాడుతూ పిఆర్ సీ గడువు ముగిసి మూడేళ్లయినా అమలు చేయడం లేదని,గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు డీఏలు పెండింగ్ ఉన్నాయని, ఉపాధ్యాయ, ఉద్యోగుల పెన్షనర్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం లేదని,హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయడం లేదని, ఆశాస్త్రీయంగా ఉన్న 25 జీవో ను సవరించాలని, పర్యవేక్షణ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పండిట్స్ పీఈటి పోస్టులు అప్గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించాలని, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, సిఆర్ టి లు, కేజీబీవీ, కాంట్రాక్ట్ టీచర్లకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని, కేజీబీవీ,యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల 25 రోజుల సమ్మె కాల జీతం చెల్లించాలని, కేజీబీవీ,సిఆర్టి మోడల్ స్కూల్, గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ,ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిష్కారం కాకుంటే ఈనెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాదులో మహాధర్న నిర్వహించనున్నామని,అప్పటికి సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో... అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని తెలిపారు. యుఎస్పీసీ జిల్లా, మండల స్టీరింగ్ కమిటీ సభ్యులు బి. రామ్ చంద్,మూడ్ పుల్లయ్య, నరసయ్య ప్రధానోపాధ్యాయులు బి.లక్ష్మ,జి.నాగరాజు నాయకులు రాఘవరావు, శంకర్రావు, శ్రీదేవి, నరసింహారావు,శ్యాం కుమార్, బి.సింగ్య, వెంకటరమణ, శారదాబాయి, బి.రవి,బోడ సక్రాం, గోపాల్, శ్రీకాంత్, నరసింహారావు, శివ, దేవి, రాజేశ్వరి, శ్రీనివాస్, కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు సీఎం సానుకూలత

## మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ యోధుడు, ప్రజా నాయకుడు పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22 న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు సచివాలయం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు.



పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని, ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ-డీ కేటగిరీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలని కూడా ముఖ్యమంత్రి కి విన్నవించారు.ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ముదిరాజ్ సంఘం నాయకుల విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పండుగ సాయన్న జయంతి అధికారిక నిర్వహణతో పాటు ముదిరాజ్ సామాజిక వర్గం బీసీ-ఏ కేటగిరీకి మార్పు అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## చిరాగ్‌పల్లిలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**జహీరాబాద్, ఆగస్టు 14 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.

గ్రామంలో రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు గిరిధర్‌రెడ్డి తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలోని అంతర్గత రహదారులు మెరుగుపడి ప్రజలకు, వాహనదారులకు ప్రయోజనం కలుగుతుందని స్థానికులు తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టినందుకు చైర్మన్ గిరిధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మిని ప్రకాష్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, అనేగుంట సర్పంచ్ నరేష్, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సునీల్తో పాటు గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో భాజపా భారీ తిరంగా ర్యాలీ



**జహీరాబాద్, ఆగస్టు 14 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక లైఫ్‌స్టైల్ కాలేజీ వద్ద మాజీ ఎంపీ బీబీ పాటిల్ జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ విద్యార్థులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పురవీధుల్లో కదం తొక్కారు. లైఫ్‌స్టైల్ కాలేజీ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌక్ మీదుగా ఇబీ గెస్ట్‌హౌస్ వరకు సాగింది. 'హర్ ఘర్ తిరంగా' నినాదంతో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయాలని బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గం లోని బిజెపి నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎస్.ఐ.ఆర్ నోటిస్లకు స్పందించడి



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 14 ఆగస్టు 2026**ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాట్లలో పేరుగాంచిన భారత ఎన్నికల సంఘం, ప్రతీ పౌరుడు ఓటు అనే వజ్రాయుధ హక్కు కలిగి ఉండాలనే సదుద్దేశ నిర్ణయం మేరకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధతకు లోబడి చేపట్టిన ఓటు డిజిటలైజేషన్ ప్రక్రియ ఫారం నింపడంలో ప్రజలు నానా అవస్థలు, ఇబ్బందులు పడ్డ మాట వాస్తవమే. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకుడు అందె లక్ష్మణ్ రావు ఆద్వర్యములో దాదాపు మండల రోజుల పాటు మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నివాసుల సహాయార్ధం ఓటు డిజిటలైజేషన్ సాహాయక కేంద్రం ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఇట్టి కార్యక్రమంలో భాగస్వామ్యం పొందిన వారు లబ్ధిపొందడం జరిగినదన్ని, ఇతరుల కొంతమంది ఫారంలకు నోటీసులు రాబోతున్నవని అందె లక్ష్మణ్ రావు తెలిపారు. రాజేందర్ నగర్ నియోజకవర్గంలో 6,25,283 ఓటరులు ఉండగా 2.47 లక్షల మంది స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఫారంలు నింపకుండా గమ్మున ఉండడం మూలంగా 61.12 శాతం మంది 3,88,278 ఓటర్లు మాత్రం తమ ఫారంలు నింపి అధికారులకు అందజేసి నిమ్మళంగా ఉన్నామనీ భావిస్తు ఉన్నారు. వాస్తవానికి విచ్చేసిన ఫారంల నుండి 15.64 శాతం మంది ఓటర్లు అవగాహన రహితంగా ఓటు డిజిటలైజేషన్ ఫారం మ్యాపింగ్ విధి విధానాలు నింపడంలో ఇక్కట్ల పాలై పొరపాటుగా ప్రక్రియ సరిగా చేయక పోవడంతో 99,339 మంది ఓటర్లు త్వరలోనే నోటీస్ లు అందుకోబోతున్నారని సంబందిత ఎన్నికల సంఘం అధికారుల ద్వారా సేకరించిన సమాచారం మేరకు అందె లక్ష్మణ్ రావు తెలియ పరుస్తు అందుకు సహకరిస్తూ విధిగా సంబందిత పత్రాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు హితవు పలుకుతూ అన్యధా మరికొంత మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్త పరిచారు. మణికొండ మున్సిపల్ 127 డివిజన్లోని 33,423 ఓటరులలో నుండి కేవలం 53.33 శాతం మంది 17,826 ఓటరులుగా నమోదు చేసుకున్నారని, అదేవిధంగా నెక్నంపూర్ మున్సిపల్ 128 డివిజన్లోని 38,431 ఓటరులు ఉండగా 58.4 శాతం అనగా 21,290 ప్రజలు ఓటరులుగా నమోదు చేసుకున్నారని స్థానిక విశేషాలుగా అందె లక్ష్మణ్ రావు తెలియ పరిచడ మైనది.

## నూతన బేకరీ నీ ప్రారంభించిన సర్పంచ్ నాగేశ్వరరావు.



**ఖమ్మం ప్రతినిధి ఆగస్టు 14 ప్రజాబలం:**తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్లో మండల ప్రజలకు అందుబాటులో ఎస్ ఎల్ వి బెంగళూరు బ్యాకరీని శుక్రవారం ఉదయం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పి నాగేశ్వరరావు ఉపసర్పంచ్ కే లక్ష్మారెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరు వాసి ఆర్ రమేష్ తల్లాడలో బేకరీని ప్రారంభించడం అభినందనీయం ఇక్కడ అన్ని రకాల స్వీట్లు కేకులు సరసమైన ధరలకు అందించడం మంచి శుభ పరిణామ ము అని చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో దగ్గుల రాజశేఖర్ రెడ్డి. మొక్క సత్యనారాయణ. మిత్రులు బంధువులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వొద్దు.

### అధికారులు అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలి.

### :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 14 కలెక్టరేట్**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా, అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.



శుక్రవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది డ్యూటీ పాసులు, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. మేడారం వనదేవతల ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, నూతన కలెక్టరేట్, పైలాన్, గట్టమ్మ ఆలయ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మేడారంలో వనదేవతల దర్శనం, తులాబారం, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలతో పాటు నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు.

ప్రతి అధికారికి అప్పగించిన బాధ్యతపై పూర్తి అవగాహన ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సమన్వయంతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొత్తికోయల సమస్యలపై ఫారెస్ట్ అధికారులతో చర్చించిన జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 14 మేడారం**తాడ్వాయి రేంజర్ రమేష్ డి ఆర్ ఓ కృష్ణవేణి మేడం గారిని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు బాబు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా గొత్తి కోయలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. గొత్తి కోయల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చిటమట రఘు బాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చేల వినయ్, ప్రాజూ డైరెక్టర్ వంగపండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి గారి ములుగు పర్యటనను విజయవంతం చేద్దాం జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, కాంగ్రెస్ నాయకుల పిలుపు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 14** ఏటూరు నాగారం బిఈ నెల 16న ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పర్యటన నేపథ్యంలో ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి, శివపూర్ గ్రామాల్లో జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు మరియు కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులతో సమావేశమై సీఎం పర్యటనకు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

అనంతరం గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.బిమంత్రి ధనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో కాంగ్రెస్ శ్రేణులు గ్రామాల్లో పర్యటిస్తూ సీఎం పర్యటన విజయవంతానికి ప్రజలను సమాయత్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం సీఎం రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నారని తెలిపారు. ఏటూరునాగారం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యువత, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ములుగు అభివృద్ధి పథంలో మరో ముందడుగు..సీఎం రేవంత్ రెడ్డి గారి పర్యటనను ఘనంగా విజయవంతం చేద్దాం...ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చేల వినయ్, పిఎసిఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి, కుంభం రాజేష్, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

### కుటుంబ కలహాలతో జడ్పీఎన్ఎఫ్ ఉద్యోగి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నం

లక్కిరెడ్డిపల్లి మండలంలోని బీ యర్రగుడి గ్రామం బిఏ నాగిరెడ్డి పల్లెకు చెందిన హరికృష్ణ అనే వ్యక్తి కుటుంబ కలహాలతో గురువారం రాత్రి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు రాయచోటి వేంపల్లి మార్గమధ్యంలోని దాసిరెడ్డి మిట్ట సమీపంలో బిఏ నాగిరెడ్డిపల్లి కి చెందిన జడ్పీఎన్ఎఫ్ ఉద్యోగి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని కాలిపోతున్న తరుణంలో అటువైపు వెళుతున్న వాహనదారులు, స్థానికులు గమనించి 108 కు సమాచారం అందించి హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. హరికృష్ణ రామాపురం మండలం కల్పనాయన్ చెరువు పరిధిలో జడ్పీఎన్ఎఫ్ ఎఫ్ఎంటిగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ మేరకు మెరుగైన వైద్యం కొరకు కడప రిమ్స్కు తరలించినట్లు అక్కడ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

# పంచలింగాల్‌లో గులాబీ జోష్, బి ఆర్ ఎస్ లోకి భారీగా యువత చేరిక







**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 14(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో నిర్వహించిన బి అర్ ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపారు.ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బి అర్ ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నూతన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

కార్యకర్తల సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో పంచలింగాల్ గ్రామానికి చెందిన యువకులు వివిధ పార్టీల నుంచి బి అర్ ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

యువత పెద్ద సంఖ్యలో బి ఆర్ ఎస్ లో చేరడంతో పంచలింగాల్‌లో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. యువత జోష్‌తో.. గులాబీ పార్టీ వైపు భారీ అడుగులతో పంచలింగాల్‌లో బి ఆర్ యస్ బలం మరింత పెరిగిందని నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, పంచాలింగల్ సర్పంచ్ మహేందర్ ,యూత్ అధ్యక్షులు మధుకర్, పిఎసిఎస్ డైరెక్టర్ యాదయ్య ,నాయకులు మంగలి రమేష్, డైనమిక్ లీడర్ డి అశోక్ ,రచయ్య నాయబ్ గౌడ్, శంకర్ రెడ్డి, నరేష్ గౌడ్, అంజయ్య గౌడ్ ,మాజీ కో ఆప్షన్ సోహెల్ , మండలమైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ యో ద్దీన్,ఘనపూర్ సంతోష్ ,వికాస్,నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## సంగారెడ్డి లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు అందోల్ నియోజకవర్గం లోని కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు ఆహ్వానం

### రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :ఆందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి చెందిన నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్, (ఎన్ ఎస్ యు ఐ) సోషల్ మీడియా, ఇతర ఫ్రంటల్ ఆర్గనైజేషన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ఆహ్వానం.గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా, కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్నిప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమానికి ఆందోల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వానిస్తున్నామని సంగారెడ్డి మంత్రి క్యాంపు కార్యాలయం కార్యకర్తలకు నాయకులకు ఆహ్వానం పలికింది,ఇట్లువైద్య ఆరోగ్య శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం సంగారెడ్డి......

# సీఎం పర్యటనలో జహీరాబాద్‌కు నిధులపై ప్రకటన చేయాలి



**జహీరాబాద్, ఆగస్టు 14 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి మంజూరైన నిధులను నిలిపివేయకుండా వెంటనే విడుదల చేయడంతోపాటు పెండింగ్ అభివృద్ధి పనులకు కొత్తగా నిధులు కేటాయించాలని కోరారు. జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని మాణిక్‌రావు ఆరోపించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రోడ్ల అభివృద్ధికి రూ.73 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.30 కోట్లు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదన్నారు. దీంతో నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితి అధ్వానంగా మారిందని తెలిపారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి మంజూరైన రూ.50 కోట్లలో రూ.25 కోట్ల పనులు పూర్తయ్యాయని, మరో రూ.25 కోట్ల పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. సంగమేశ్వర--బసవేశ్వర ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లు కేటాయించి 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను పలుమార్లు ప్రస్తావించినా 'నోట్ చేసుకుంటాం' అనే సమాధానం తప్ప పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేశామని, వాటిని పరిశీలిస్తామని కేంద్రం స్పందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా స్పందన లేకపోవడం బాధాకరమని మాణిక్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

# కొత్త దర్శకనిర్మాతలకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదు!

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలి: నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ

హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త దర్శకులు, నిర్మాతలు, చిన్న బడ్జెట్ సినిమాలకు స్వేచ్ఛగా ఎదిగే అవకాశం లేకుండా పోతోందని నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. చిన్న సినిమాల విషయంలో థియేటర్ల కేటాయింపు నుంచి ఓటీటీ, ఆడియో, శాటిలైట్, ఇతర భాషల హక్కుల వరకు అనేక సమస్యలు ఉన్నాయని, వీటిపై పరిశ్రమలోని పెద్దలు, స్టార్ హీరోలు స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.

హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'ఓ అందాల రాక్షసి' రీ-రిలీజ్ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో షెరాజ్ మెహదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమ సమస్యలపై ప్రశ్నిస్తే తనకు తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో ప్రెస్ మీట్ నిర్వహించేందుకు అవకాశం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. దీంతో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా మీడియాతో మాట్లాడిన ఆయన.. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్తవారికి ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.

**కొత్తవారిని అడ్డుకుంటున్నారు**

"సినీ పరిశ్రమలోకి కొత్తవారు రాకూడదన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయి. కొత్త దర్శకులు, నిర్మాతలు ఎన్నో కష్టాలు పడి సినిమా పూర్తి చేసిన తర్వాత సెన్సార్, క్యూబ్, పబ్లిసిటీ వంటి అంశాల పేరుతో అదనపు భారాలు పడుతున్నాయి. చివరకు సినిమా విడుదలకు కూడా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇది మారాలి" అని షెరాజ్ మెహదీ అన్నారు.

చిన్న సినిమాలపై పరిశ్రమలో రాజకీయాలు, ఆధిపత్య ధోరణులు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా మార్కెట్ విస్తరిస్తున్న సమయంలో చిన్న నిర్మాతలకు మాత్రం అవకాశాలు తగ్గిపోవడం బాధాకరమన్నారు. క్యూబ్ వంటి సాంకేతిక సేవలకు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఈ సమస్యలను ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**థియేటర్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం**




చిన్న సినిమాలకు థియేటర్లు దక్కడం లేదని షెరాజ్ మెహదీ ఆరోపించారు. "20 థియేటర్లు ఇస్తామని చెప్పి చివరకు ఐదు థియేటర్లు మాత్రమే కేటాయించారు. అందుకే ఒక దశలో మా సినిమా విడుదలను రద్దు చేయాల్సి వచ్చింది. చిన్న సినిమాకు సరైన స్క్రీన్లు ఇవ్వకపోతే ప్రేక్షకుల వద్దకు సినిమా ఎలా వెళ్తుంది?" అని ప్రశ్నించారు.

చిన్న సినిమాలకు థియేటర్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలతో ఏషియన్ థియేటర్స్‌కు చెందిన సునీల్‌తో పాటు పీవీఆర్, ఐనాక్స్ యాజమాన్యాలకు లీగల్ నోటీసులు పంపినట్లు ఆయన తెలిపారు.

**"ఫిల్మ్ చాంబర్‌లో అహంకారం పెరిగింది"**

తెలుగు ఫిల్మ్ చాంబర్ వ్యవస్థపైనా షెరాజ్ తీవ్ర విమర్శలు చేశారు. "చాంబర్‌లో ప్యూన్ నుంచి ప్రెసిడెంట్ వరకు పరిశ్రమ సమస్యలు అందరికీ తెలుసు. కానీ నిర్ణయాలు తీసుకునే విషయంలో అక్కడ పనిచేసే వారికి ఎలాంటి స్వేచ్ఛ లేదనే పరిస్థితి కనిపిస్తోంది. సినీ పెద్దల్లో మమకారం తగ్గి అహంకారం పెరిగింది. పరిశ్రమను కాపాడాల్సిన వ్యవస్థలు కొందరి చేతుల్లో బొమ్మల్లా మారకూడదు" అని అన్నారు.

తన పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోనని స్పష్టం చేశారు. అవసరమైతే చట్టపరమైన పోరాటం కొనసాగిస్తానని, ఇదే అంశంపై వందసార్లు అయినా ప్రశ్నిస్తానని తెలిపారు.

"ఈరోజు చిన్న సినిమాలకు ఎదురవుతున్న సమస్యలు రేపు పెద్ద సినిమాలకూ ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పరిష్కరించాలి" అని సూచించారు.

**"ఇది ఒక్కరి పోరాటం కాదు"**

తాను చేస్తున్న పోరాటానికి వందలాది మంది మద్దతు ఇస్తున్నారని, భవిష్యత్తులో ఈ మద్దతు వేలల్లోకి మారుతుందని షెరాజ్ మెహదీ అన్నారు.

"నేను ఎవరికీ భయపడను. చట్టపరమైన పోరాటం చేయాల్సి వచ్చినా చేస్తాను. అవసరమైతే ఎంత దూరమైనా వెళ్తాను. కొత్త నిర్మాతలు, దర్శకులు, చిన్న సినిమాలకు న్యాయం జరిగే వరకు నా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.

**భారీ స్థాయిలో 'ఓ అందాల రాక్షసి' రీ-రిలీజ్**

తాను దర్శకత్వం వహించి నటించిన 'ఓ అందాల రాక్షసి' చిత్రానికి అద్భుతమైన కంటెంట్ ఉందని షెరాజ్ మెహదీ తెలిపారు. ప్రేక్షకులు సినిమా చూస్తున్నంతసేపు కథలో లీనమయ్యేలా చిత్రాన్ని రూపొందించామని చెప్పారు.

గతంలో ఎదురైన థియేటర్ల సమస్యలను అధిగమించి, సరైన సంఖ్యలో థియేటర్లు, ఓటీటీ, ఆడియో, ఇతర హక్కులను సాధించి త్వరలోనే 'ఓ అందాల రాక్షసి'ని భారీ స్థాయిలో రీ-రిలీజ్ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

"సినిమా చిన్నదా.. పెద్దదా అన్నది కాదు. కంటెంట్‌కు అవకాశం ఇవ్వాలి. కొత్త దర్శకుడైనా, నిర్మాతైనా తన ప్రతిభను నిరూపించుకునే స్వేచ్ఛ ఉండాలి. అదే నిజమైన సినిమా పరిశ్రమకు బలం" అని షెరాజ్ మెహదీ అన్నారు.

## అందోల్ నియోజకవర్గంలో జోరుగా అక్రమ ఇసుక మట్టి దందా పోలీసుల కను సైగల్లోనే నడుస్తున్న వైనం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గంలో అక్రమ మట్టి ఇసుక దందా, పోలీసుల కనుసైగల్లోనే నడుస్తుందని, స్పష్టంగా అర్థం అవుతుంది, రాత్రింబవళ్లు అని తేడా లేకుండా, ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలోని, తాడ్దాన్ పల్లి, ఆందోల్ శివారులోని పలు ప్రాంతాల నుంచి, డంపర్ లలో భారీగా అక్రమ మట్టిని తరలిస్తున్నారు, ఈ విషయాలపై ఎవరైనా మీడియా ప్రతినిధులు, పోలీసులకు గాని, మైనింగ్ రెవెన్యూ అధికారులకు సమాచారం ఇస్తే, వ్యాపారులు మాత్రం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి, మీరు రాసిన మాకేం కాదు అన్న ధోరణిలో మట్టి వ్యాపారులు అడ్డ అదుపు లేకుండా, దర్జాగా మట్టిని తరలిస్తున్నారు, ఇందుకు మట్టి వ్యాపారులు, నెలవారీగా పోలీస్ సర్కిల్ పరిధిలోని, వివిధ అధికారులకు, నెలవారి మామూలు ఇవ్వడంతో పాటు, కిందిస్థాయి సిబ్బందికి సైతం మామూళ్లు ఇస్తున్నారని విమర్శలు ఉన్నాయి, మీడియా ప్రతినిధులు అక్రమంగా మట్టిని తరలిస్తున్న డంపర్లను అడ్డుకుంటే ఏమైనా చేసుకోండి అని వాహనం డ్రైవర్లు దిగిపోతున్నారు, పోలీసులకు గాని ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇస్తే, ఏ ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం చూస్తే, వారికి ఏ పాటి మామూళ్లు ముడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు, ఒక తడ్డాన్ పల్లి,గ్రామ శివారులో నుంచే ప్రతిరోజు 20 నుంచి 50 దంపర్ల వరకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు, అయినా రెవెన్యూ,మైనింగ్,పోలీస్, అధికారులు, వీటిని చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ఈ అక్రమ మట్టి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్థరాత్రి టన్నెల్ లో మంత్రి నిమ్మల పరిశీలన

విజయవాడ వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్ -2 లో 12 వ కి . మీ దగ్గర చిక్కుకున్న టన్నేల్ బోరింగ్ మిషన్ వెలికితీత పనులను స్వయంగా పరిశీలించేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు రాత్రి 11 గంటలకు టన్నెల్ లోకి వెళ్లారు. అయన వెంట ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జి నిరీక్షణ బాబు మరియు ఇరిగేషన్ అధికారులు, మెగా ఇంజనీరింగ్ ప్రతినిధులు వున్నారు. అర్ధరాత్రి దాదాపు 4 గంటల పాటు టన్నెల్ లో టీబీఎం వెలికితీత పనులు, లైనింగ్ పనులను మంతరి స్వయం గా పరిశీలించారు.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com